నవతెలంగాణ

1

వరంగల్

బుధవారం | ఏప్రిల్ 09, 2025 | www.navatelangana.com



రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ నడుంబిగించాలి

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

నవతెలంగాణ-పర్వతగిరి

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని జై బాపు, జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో భాగంగా మంగళవారం ముఖ్యఅతిథిగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని బూరుగుమల్ల, మోత్యాతండా గ్రామపంచాయతీలలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య స్థిరత్వానికి పునాది కాగా, బీజేపీ ప్రభుత్వం దీన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా బీజేపీ పాలన కొనసాగుతోందని, రాజ్యాంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న మోదీ ప్రభుత్వం పై దేశం వ్యాప్తంగా ప్రజలు గట్టిగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, కాంగ్రెస్ పార్టీ దేశ రాజ్యాంగ పరిరక్షణ కోసం "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" నినాదంతో ముందడుగు వేస్తోందని తెలిపారు. రాహుల్ గాంధీ "భారత్ జోడో యాత్ర" ద్వారా సమానత్వం, సౌభ్రాతృత్వం పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. గత పదేళ్లుగా రాజ్యాంగ విలువలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై దేశ ప్రజలు నిలబడి పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మార్గదర్శకంలో, కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్‌నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షులు రాకేష్, రమేష్, నాయకులు లింగారెడ్డి, మండల ఎస్సీ నాయకులు నరకుడు రవీందర్, కుమార్, శేషగిరిస్వామి, మోహన్‌రెడ్డి, పూర్ణచందర్, భాషానాయక్, సోమిరెడ్డి, చల్ల వెంకన్న, కొమ్ము రమేష్, రెండు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని పాదయాత్రను విజయవంతం చేశారు.

మేయర్‌కు ధన్యవాదాలు తెలిపిన ఎలక్ట్రికల్ సిబ్బంది

- జీతాలు పెంపు పట్ల హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగులు

నవతెలంగాణ-వరంగల్



జీతాలు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బల్దియాకు చెందిన ఎలక్ట్రికల్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది మంగళవారం నగర మేయర్ గుండు సుధారాణిని ప్రధాన కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్ లో సుదీర్ఘ కాలంగా వీధి దీపాల కార్మికులుగా సేవలు అందిస్తున్నామని వేతనాలు పెంచాలని కోరుతూ మంత్రి కొండా సురేఖ తో పాటు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ను కలిసి వినతి పత్రాలు అందజేయడం జరిగిన నేపథ్యంలో వేతనాల పెంపు జరిగిందని ఇందుకు సహకరించిన మంత్రి వర్యులతో పాటు శాసన సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎల క్ట్రికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-కాశిబుగ్గ



గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ పరిధిలోని ఓసిటీ లో మంగళవారం రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఓసిటీ లోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో మహంకాళి జోగిని ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా బోనాలు, విగ్రహ ప్రతిష్టాపనతో పాటు ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి డివిజన్ ప్రజలు, స్థానికులు, శివసత్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



నవతెలంగాణ-వర్ధన్నపేట

వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలో పలు డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు. ఎఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపుతో జై బాపు, జై భీమ్‌చ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ ఇన్‌ఛార్‌జ జనగాం రమేష్ గౌడ్ పర్యవేక్షణలో వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైస సురేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ పట్టణంలోని 4, 5, 6 డివిజన్లలో డీజే పాటలతో కార్యకర్తలు పాదయాత్ర చేశారు. తాళ్లకుంట తండా, భవానికుంట తండా, నీలగిరి స్వామి తండా, డీసీ తండా, గుబ్బెడి తండా, దుబ్బ తండా, రుక్కి తండాలలో జాతీయ జెండాను చేత పట్టి ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో అయినవోలు దేవస్థానం చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తూళ్ల రవి, పోశాల వెంకన్న, సమ్మెట సుధీర్‌గౌడ్, సిలివేరు శ్రీధర్ యాదవ్, ఎండీ.అన్వర్, తుమ్మల రవీందర్, భూక్యా శ్రీలత, భూక్యా భాషా, చీటూరి రాజు, భీమా నాయక్, కొండేటి బాలకృష్ణ, అంగోతు భిక్షపతి, నాను నాయక్, మాలోతు స్వామి, భూక్యా బాబూలాల్, వాంకుడోతు రాము, దుబ్బాక రాజు, విలాసారపు వెంకట్, ఎస్‌కే.షబ్బీర్, నాంపెల్లి యాదగిరి, మరుపట్ల సాయి, తాళ్లపెల్లి శ్రీను, నిరంజన్, తారాబాయి, మాలోతు దేవేందర్, అంగోతు లచ్చిరామ్, బానోత్ రమేష్, బానోత్ భిక్షపతి, మంగ్యా నాయక్, మైబు, డీసీతండా లక్ష్మణ్, వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు త్వరగా ఇండ్లు నిర్మించుకోవాలి

- జెడ్పీ సీఈవో రాంరెడ్డి

నవతెలంగాణ-పర్వతగిరి



ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు త్వరగా ఇండ్లు నిర్మించుకోవాలని జెడ్పీ సీఈవో రాంరెడ్డి సూచించారు. మండలంలోని పోౖెలట్ ప్రాజెక్టుగా గుర్తించబడిన జమాల్ పురం గ్రామపంచాయతీ పరిధిలోని నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం లబ్దిదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. త్వరగా బేస్ మెంట్ లెవల్‌లో ఇండ్ల నిర్మాణ పనులను పూర్తి చేసుకుంటే వెంటనే ప్రభుత్వం ద్వారా బిల్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఆయనతో పాటు హౌసింగ్ పీడీ గణపతి, ఎంపీడీవో శంకర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి పోశాల దివ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు జున్ను కనకయ్య యాదవ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత కల్పించేందుకే సన్న బియ్యం పంపిణీ

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- లబ్ధిదారు ఇంట్లో భోజనం

నవతెలంగాణ-కాశిబుగ్గ



రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించిందికే ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తెలిపారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో శాంతినగర్ లోని సన్న బియ్యం లబ్దిదారుడు, కాంగ్రెస్ నాయకుడు జన్ను వేణు నివాసంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య భోజనం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ ఈపథకానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, 80 శాతానికి పైగా బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనార్టీ నిరుపేద ప్రజలు లబ్ది పొందుతున్నారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేశ్వర్ మాజీ కౌన్సిలర్ దూపం సంపత్ నాయకులు జన్ను రవి, గోరంటాల రాజు, కరాటే ప్రభాకర్, మాజీ కార్పొరేటర్ తత్తారి లక్ష్మణ్, పెండ్యాల కొమరయ్య, తోట బాలరాజు, చాగంటి శ్రీనివాస్, సందెల దామోదర్, శేఖర్, చిరంజీవి, స్వరాజ్, గోవర్ధన్, కోడారి బాబు, అంజనేయులు, శ్వేత, బాబు శ్రీనివాస్, వేణు, సుదర్శన్, ఉమేందర్, దేవరాజు, వంశీ, ప్రశాంత్, లడ్డు, రాజన్ బాబు, శివ, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలి



- మేయర్ గుండు సుధారాణి
- బల్దియా కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-వరంగల్

బల్దియా సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని బల్దియా మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియా ప్రధాన కార్యాల యంలో మంగళ వారం నగర మేయర్ గుండు సుధారాణి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా మేయర్ ఛాంబర్ కింది వైపున గల సెల్లార్ ఏరియాతో పాటు కార్యాలయం లోని ఇన్‌వార్డ్, కంట్రోల్ రూమ్, ఎల్ఆర్ ఎస్ హెల్ప్ డెస్క్, జనన మరణ ధృవీకరణ సెక్షన్, పెన్షన్ సెక్షన్, అకౌంట్స్ సెక్షన్‌లలో క్షేత్ర స్థాయి లో పర్యటించి జాబ్ నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా మేయర్ చాంబర్ ఉన్న సెల్లార్ ప్రాంతంలో మేయర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వ హించి అక్కడ పార్కింగ్ చేసి ఉన్న వాహనాల సమాచారాన్ని అడిగి తెలు సుకొని కార్యాలయ సిబ్బంది కార్పొరేటర్ల వాహనాలు కాకుండా ఇతర ప్రయివేట్ వాహనాలు సెల్లార్‌లో పార్క్ చేయడానికి వీలు లేదన్నారు. సెల్లార్ లో ఉన్న చెత్త.వెంటనే తొల గించాలని ఆదేశించారు. అనంతరం ప్రధాన కార్యాలయంలోని ఇన్ వార్డులో సిబ్బంది నిర్వ హిస్తున్న రికార్డులను పరిశీలించి వారు చేపట్టే జాబ్ చార్ట్‌ను అడిగి తెలుసుకున్నారు.సమ యపాలన తప్పకుండా పాటించాలని సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు.కార్యాలయ ఆవరణలో గల షీ టాయిలెట్ ప్రాంతాన్ని మేయర్ పరిశీలించారు. అనంతరం అన్ని విభాగాల అధికారులతో మేయర్ సమావేశమై ఆకస్మికంగా తనిఖీలో గుర్తించిన ఇంజి నీరింగ్ పనులు, పరిపాలన భవనాన్ని కలరింగ్ చేయాలని ఆదేశించారు. సిటిజన్ చార్టర్ ఖచ్చితంగా అమలు చేస్తూ నగర ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం నిర్వహిస్తున్న సమావేశ మందిరం పునరుద్ధరణ, నవీకరణ పనులను మేయర్ పరిశీలించి సమర్ధంగా నిర్వహించుటకు ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులకు మేయర్ పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో అదనపు కమిష నర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, హెచ్ ఓలు రమేష్, లక్ష్మారెడ్డి, జేఏఓ జగదీశ్వరి, సూపరిండెంట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటను ఆశించిన కాండం తొలుచు పురుగు..!

- నష్టాల బారిన రైతులు.. వీస్తున్న గాలితో వరి
- పంటలో తెల్ల గొలుసు వరి పంటలో తగ్గనున్న దిగుబడి
- బెంబేలెత్తుతున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నల వేడుకోలు

నవతెలంగాణ-ఖానాపురం





మండలంలో వీస్తున్న గాలులతో, మారుతున్న వాతావరణ మార్పులతో వరి పంటను కాండం తొలుచు పురుగు ఆశించి పంటలో తెల్ల గొలుసు అధికంగా దర్శనమిస్తుంది. కాగా పంట దిగుబడి తగ్గి రైతులు నష్టాల బారిన పడే అవకాశం ఉంది. అన్నదాతలు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టి, పంట పొట్ట దశలో, కంకి బయటికి వచ్చే దశలో పంటను ఆశించిన పురుగుతో గొలుసు తెల్లబడుతుంది. ఆరుకాలం కష్టించి రక్తాన్ని చెమటగా మార్చిన రైతుకు చివరికి నష్టమే వాటిల్లుతుందని మండల రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలలో పెట్టుబడులు.. రూ.వేలల్లో ఆదాయం.. సాగు చేసి అప్పుల పాలై.. రైతులు నష్టపోతున్నారని, పంట సాగు చేయలేమని చేతులెత్తే పరిస్థితి మండల రైతులలో నెలకొన్నది. పంటలలో ఏర్పడుతున్న తెల్ల గొలుసుతో రైతులు అధికంగా నష్టపోతున్నారు. పంటకు పలు రకాల క్రిమిసంహారక మందులు పిచికారి చేసినా సైతం ఫలితం శూన్యమని, పంటలో తెల్ల కంకి అధిక శాతంలో ఏర్పడుతుందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు సుమారుగా 30 నుండి 40 బస్తాల ధాన్యం దిగుబడి అందుతుంది. కాగా పంటలో తెల్ల గొలుసు ఏర్పడడంతో ఎకరాకు సుమారు 10 నుండి 15 బస్తాల ధాన్యం దిగుబడి రావడం కష్టతరమని రైతన్నలు మనోభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంటలపై సర్వే చేపట్టి వరి ధాన్యంలో తెల్ల గొలుసు ఏర్పడి నష్టపోతున్న రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని మండల రైతన్నలు వేడుకుంటున్నారు.

అధికారులతో పంట సర్వే చేపట్టాలి



సంగెం కాలువ సమీపంలో సుమారు 10 ఎకరాలలో వరి పంటను సాగు చేశాను. సోమ వారం సాయంత్రం వాతా వరణంలో మార్పు వలన విప రీతమైన గాలి వీచి ఇప్పుడే పాలు పోసుకుంటున్న వరి పంట గొలుసులకు మూగ పగిలి తెల్ల కంకిగా మారింది. వ్యవసాయ అధికారులతో నష్టపోతున్న పంట పొలాలను సర్వే చేపట్టాలి. నష్టపోయిన రైతులను ప్రభుత్వం అండగా నిలవాలి.

-అబోతు అశోక్ మనుబోతులగడ్డ, రైతు

పంట మొత్తం తెల్ల గొలుసుగా మారింది



గత రాత్రి వీచిన గాలితో పంటలో మొత్తం తెల్ల గొలుసు అధిక శాతంలో పెరిగింది. నాకున్న ఎనిమిది ఎకరాలలో వరి పంట సాగు చేశాను. ఎకరాకు సుమారు 50వేల పెట్టుబడి అవుతుంది. పంట చివరి దశలో తెల్ల గొలుసు అధికంగా ఏర్పడడంతో పంట దిగుబడి తగ్గి అధికంగా నష్టపోయే పరిస్థితి ఉంది. ప్రభుత్వ స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలి.

-ఓర్సు రవి, మనుబోతుల గడ్డ రైతు

కాండం తొలుచు పురుగుతో.. తెల్లబడుతున్న గొలుసులు



వరి పంటలో దశల వారీ గా క్రిమిసంహారక మం దులు పిచికారి చేయకపోవడం వల న వరి పంటను కాండం తొలుచు పురుగు ఆశించే పరిస్థితి ఉంటుంది. సరియై న సమయంలో రైతులు గుర్తించి క్రిమిసంహారక మందులు పిచికారి చేసుకోవాలి.

-భోగ శ్రీనివాస్, ఏఓ ఖానాపురం

గాలి దుమారం.. బీభత్సం..!







- నేలరాలిన మామిడి.. విద్యుత్ స్తంభాలు
- ఆగమాగం.. మక్కరైతుకు తప్పని తిప్పలు..
- అపార నష్టంపై అధికారుల అంచనాలు..

నవతెలంగాణ -నర్సంపేట

గాలి దుమారం బీభత్సం.. మామిడి రైతులను నట్టేట ముంచింది.. మొక్కజొన్న దిగుబడులను దక్కించుకోవడం కోసం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.. కల్లాల్లో, మార్కెట్‌లో ఆరబోసిన మక్కలు గాలి దుమారంతో చెల్లాచెదురుగా పడ్డాయి. మక్కలపై కప్పిన టార్పిన్‌లు కొట్టుకపోయాయి. మరికొద్ది రోజుల్లో చేతికందాల్సిన మామిడి చేజారి పోయిందని ఆందోళన రైతులు వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ లోని నల్లబెల్లి మండలంలో 45 ఎకరాలు, నర్సంపేట మండలంలో 14 ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు నష్టం వాటిల్లినట్లు ఉద్యానవన అధికారి జ్యోతి తెలిపారు. ఈ నష్టంపై అంచనాలను ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు.

- విరిగిన విద్యుత్ స్తంభాలు.. నిలిచిన సరఫరా..

బలమైన గాలి దుమారం బీభత్సంతో నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి మండలాలలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేక చిమ్మటి చీకటి ఆవరించింది. దాదాపు 5 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎన్పీడీ సీఎల్ సిబ్బంది అప్రమత్తమై ప్రధాన లైన్‌లను మరమ్మత్తు చర్యలు చేపట్టారు. పట్టణంతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్తు పునరుద్ధరించారు.



గంజాయి క్రయ విక్రయాలకు పాల్పడుతున్న యువకుల అరెస్టు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి:

గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు గంజాయిని కొనుగోలు, సేవించిన మైనర్ బాలుడితో సహ మరో ఆరుగురుని హన్మకొండ పోలీసులు మంగళవారం అరెస్టు చేసారు. వీరి నుండి సుమారు 180 గ్రాముల గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్, రెండు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి హన్మకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి వివరాలను వెల్లడిస్తూ ఈకేసులో ప్రధాన నిందితులు భూపాల్ పల్లి జిల్లాకు చెందిన మోతే మణికంఠ(25), కోటగిరి రోహిత్(25)లు సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇందుకోసం నిందితులు ద్విచక్ర వాహనంపై ఒడిషా రాష్ట్రం కల్మీల గ్రామానికి వెళ్ళి అక్కడ నాగరాజు అనే వ్యక్తి వద్ద నిందితులు అర కిలో గంజాయి కొనుగోలు చేశారు. కోనుగొలు చేసిన గంజాయిలో రోహిత్ కొంత మొత్తాన్ని తీసుకున్నాడు. మిగితా గంజాయిని మరో నిందితుడు మోతే మణికంఠ సోమవారం వద్ద వున్న గంజాయిని విక్రయించేందుకు హనుమకొండకు రావడంతో పోలీసులకు అందిన సమచారం మేరకు మోతే మణికంఠను హన్మకొండ పోలీసులు అదుపులో తీసుకొని బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో గంజాయిని గుర్తించి పోలీసులు నిందితుడిని స్టేషన్‌కు తరలించి విచారించగా నిందితుడు ఇచ్చిన సమాచారం, గంజాయి విక్రయించిన మరో నిందితుడు రోహిత్‌తో పాటు గంజాయిని కొనుగోలు చేసిన మైనర్ బాలుడితో పాటు మేకల అవినాష్, శనిగరపు అభిలాష్, కాంతాల రాజిరెడ్డి, ఓదెల అరుణ్‌లను అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు ఒడిషా చెందిన నాగరాజుతో పాటు, వడ్డెపల్లి ప్రాంతానికి చెందిన తాళ్ళపెల్లి చిన్ను ప్రస్తుతం పరారీలో వున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన హన్మకొండ ఇన్స్‌స్పెక్టర్ సతీష్, ఎస్సై పరుశురాములు, ఆడ్మిన్ ఆశోక్‌కుమార్, కానిస్టేబుల్ అనిల్, సతీష్, కిరణ్‌లను ఏసీపీ అభినందించారు.

సోషల్ వెల్ఫేర్‌లో సీటు సాధించిన విద్యార్థి రితిక్

నవతెలంగాణ-నెక్కొండ



నెక్కొండ మండలంలోని పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్న పాఠశాల విద్యార్థి ఇటీవల వెలువడిన సోషల్ వెల్ఫేర్ ఎంట్రన్స్ పరీక్షల్లో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమవరపు యుగేంధర్ తెలిపారు. పత్తిపాకకు చెందిన గ్రామ పంచాయతీ వర్కర్ మాదారపు కుమార్ కుమారుడు రితిక్ ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచడంతో పాటు నర్సంపేట సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో సీట్ సాధించిన సందర్భంగా పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థిని సన్మానించడంతోపాటు విద్యార్థి తల్లి దండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమవరపు యుగంధర్, ఉపాధ్యాయుడు తీరాల ప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు యుగంధర్ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలకాలం లో పత్తిపాక పాఠశాల లో చదివిన సుమారు 27 మంది విద్యార్థులు గురుకుల, మోడల్ స్కూల్స్ ఎంట్రన్స్ పరీక్షలలో ప్రతిభ కనబరిచి కార్పొరేట్ స్కూల్స్ విద్యార్థులతో సమానంగా సీట్లు సాధించారని తెలిపారు. తల్లిదండ్రులు డబ్బులు వృధా చేసుకోకుండా వారి పిల్లలను అన్ని సౌకర్యాలు, ఉన్నత ప్రతిభ చాటే ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠ శాలల్లో చేర్పించాలని కోరారు.

గాలి దుమారానికి కూలిన గేదెల షెడ్

నవతెలంగాణ-నెక్కొండ



నెక్కొండ మండలంలో సోమవారం రాత్రి వీచిన బలమైన ఈదురుగాలులతో మండలంలోని అజ్మీర మంగ్య తండా గ్రామపం చాయతీ మామిడి తోట తండాలో రైతు మాలోతు దలి సింగ్కు, వెంకన్న చెందిన బర్ల షెడ్ కూలిపోయింది. గత నెలలోనే బర్ల ఫామ్ పెట్టుకొనుటకు రూ.20 లక్షల వ్యయంతో బర్ల షెడ్డు నిర్మించుకోగా ఎదురుగాలులకు కూలిపోయిందనే బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బలమైన ఈదురుగాడుపులతో బర్ల షెడ్ రూ.15 లక్షల వరకు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు బాధిత రైతులు తెలిపారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహసిల్దార్ చెప్పారని రైతులు చెప్పారు.

11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-పర్వతగిరి

సామాజిక విప్లవ కారుడు, సంఘసంస్కర్త మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను ఈనెల 11న మం డలంలోని చింత నెక్కొండలో ఘనంగా నిర్వహి ంచనున్నట్లు, ప్రతీ ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని మహాత్మా జ్యోతిరావు పూలే చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గటిక మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అం బేద్కర్, పూలే ఆశయ సాధన కోసం, సమ సమాజ స్థాపన కొరకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలు పునిచ్చారు.

డెయిరీ యూనిట్ స్థాపన స్థల పరిశీలన

నవతెలంగాణ-దామెర

దామెర మండల కేంద్రంలో డెయిరీ యూనిట్ స్థాపన కోసం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మహిళల ఉపాధి కల్పన కోసం యూనిట్ స్థాపిస్తామని ఇటీవల తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు డీఆర్‌డీఓ మేన శీను మంగళవారం డెయిరీ యూనిట్ స్థాపన కోసం స్థల పరిశీలన చేశారు. అనంతరం మాట్లాడుతూ స్థలసేకరణ విషయమై జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మిదేవి, ఆర్ఐ సంపత్, ఏపీఎం ఝాన్సీ, ఏపీవో శారద పాల్గొన్నారు.

అవినీతి అధికారి వెంకట్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-పరకాల



పరకాల మున్సిపాలిటీలోని రికార్డు అసిస్టెంట్‌ను బెదిరించి తాళాలు తీసుకొని అక్రమంగా చొరబడి, రికార్డులు మార్చి అవినీతి, అక్రమాలకు పాల్పడిన మున్సిపాలిటీ అధికారి వెంకట్‌రెడ్డిని సస్పెండ్ చేసి క్రిమినల్ కేసునమోదు చేయాలని ఏబీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని మున్సిపాలిటీ రీజినల్ డైరెక్టర్ షేక్ మసూద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మోరే ఐలయ్య మంద వెంకటయ్య, పోలేపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

10న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

నవతెలంగాణ-సుబేదారి

ఈనెల10న ములుగురోడ్‌లోని ఉపాధి కార్యాలయంలో నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ ఉపాధికల్పన అధికారి ఎం.మల్లయ్య తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి పదవ తరగతి ఆ పైన ఏదైనా విద్యార్హతలు కలిగి నిరుద్యోగ యువతీ, యువకులు ఉదయం 11 గంటలకు జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 7893394393 ను సంప్రదించాలని కోరారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-ఎల్కతుర్తి



అత్త, భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్కతుర్తి మండలం సూరారంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కమలాపూర్ మండలం దేశరాజుపల్లి గ్రామానికి చెందిన శ్రీరామోజు రమేష్‌చారికి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణానికి చెందిన హిమబిందు (36)తో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ అనంతరం ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో బంగారు ఆభరణాలు తయారు చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతురాలి అత్త లక్ష్మి, భర్త రమేష్‌లు ఆమెను మానసికంగా వేధింపులకు గురి చేసేవారు. ఈ క్రమంలో వారి వేధింపులు భరించలేక మనస్థాపానికి గురై ఇంట్లోఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి పంచకోటి సదానందచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజురాబాద్ సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

ఫ్రెండ్స్ బీయింగ్ హెల్పింగ్ హాండ్స్ సొసైటీ మడికొండ తరుపున మహేందర్ రాంపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, పరీక్ష ప్యాడ్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం రామ చంద్రారెడ్డి సొసైటీ ప్రతినిధులు శిరీష,భాగ్యలక్ష్మి, మహేందర్ ,పవన్ లకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లీలరాణి, లక్ష్మీ, శంషుద్దీన్, బ్రహ్మ చారి, అరుణ, స్వర్ణలత విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్య జీవానికి మార్గం ఎన్నటికీ మారనిది

నవతెలంగాణ-వేలేరు



నిత్య జీవానికి మార్గం ఎన్నటికీ మారనిది బిషప్ డాక్టర్ బి.యేసుపాదం అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి లో నూతన మందిరంను ప్రతిష్ఠించారు. హెర్మోను గాస్పుల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ఎస్.లూదియమ్మ, స్థానిక సంఘ కాపరి పాస్టర్ ఎ.వెంకట్రాజ్యం, హెర్మోను గాస్పుల్ మినిస్ట్రీస్ సహవాసం సేవకుల ఆధ్వర్యంలో నిర్వహించిన మందిర ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి బిషప్ డాక్టర్ బి.యేసుపాదం, యెహెజ్కేలు, తెలంగాణ రాష్ట్ర ఆయిల్ అండ్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి హాజరయ్యారు. మందిర ప్రతిష్టాపన మహోత్సవంలో స్థానిక మండల్ ఫెలోషిప్ పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం రావాలి


నవతెలంగాణ-శాయంపేట



పద్మశాలీలు అన్నిరంగాల్లో రాణిస్తున్నప్పటికీ ఒక రాజకీయ రంగంలో వెనుకబాటుతనం ప్రదర్శిస్తున్నారని పద్మశాలీ కులస్తుల రాజకీయ చైతన్యం రావాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్ అన్నారు. మండల కేంద్రంలో గల చేనేత సహకార సంఘంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మండల కమిటీతోపాటు, యువజన, మహిళా విభాగం కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకొని నూతన సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు బచ్చు ఆనందం, ప్రధాన కార్యదర్శి దిడ్డి రమేష్, యువజన విభాగం అధ్యక్షులు పోరండ్ల కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి కందికట్ల ప్రశాంత్, మీడియా కోఆర్డినేటర్ పులికంటిరాజేందర్, ఉపాధ్యక్షులు వెంగళ వేణుగోపాల్, పసినూటి భిక్షపతి, బాసని రవి, వలసదాసు చంద్రమౌళి, కుసుమ శరత్ బాబు, బూర లక్ష్మీనారాయణ, మామిడి శంకర్‌లింగం, రంగుఆనందం, దిడ్డి ప్రభాకర్, కల్పన, రాణి, పద్మ శాంత, రవి, ప్రకాష్, పద్మశాలీ కులస్తులు పాల్గొన్నారు

రాజ్యాంగాన్ని మార్చే కుట్రను బీజేపీ మానుకోవాలి

నవతెలంగాణ-ఆత్మకూరు



భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర బీజేపీ మానుకోవాలని కాంగ్రెస్ మండల కో-ఆర్డినేటర్ పెరుమండ్ల రామకృష్ణ అన్నారు. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు దేశ సమాజం క్షమించారనిదన్నారు. మంగళవారం ఆత్మకూర్ మండలంలోని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమం గుడెప్పహడ్ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెరుమాండ్ల రామకష్ణ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి రాహుల్ గాంధీ పిలుపునిచ్చారని అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు దేశ సమాజం క్షమించారనిదన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని క్షేత్ర స్థాయిలో బలంగా తీసుకెళ్ళాల్సిన అసవరం ఉందన్నారు. ఈ కార్యక్రమం ఆశయాలకు తగ్గట్టుగానే రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ విధానాలను రూపొందిస్తుందన్నారు. రాష్ట్రంలో విప్లవాత్మక కార్యక్రమాలు తీసుకోవడం జరిగిందన్నారు. బీసి కుల గణన, ఎస్సీవర్గీకరణ బిల్లుల ఆమోదం సామాజిక విప్లవం తీసుకువస్తుందన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ టీరం సునంద సుధాకర్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షులు కందికొండ రఘుపతి, మాజీ ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, మండల సమన్వయ కమిటీ, ముద్దం సాంబయ్య ఏరుకొండ రవీందర్ గౌడ్, బోరిగం సామి, మాజీ సర్పంచ్ కంచ రవికుమార్, అధికార ప్రతినిధి ఎంఏ.గఫూర్, ఎనకతల రవీందర్, అంబాటి రాజా స్వామి, రేవూరి జైపాల్ రెడ్డి, యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరుగంటి మహిపాల్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కుండే కృష్ణంరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి.ఖాజా, మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఎండి చిరంజీవి, రెడ్డి, ఆత్మకూరు మండల యూత్ అధ్యక్షులు తనుగుల సందీప్, గ్రామ పార్టీ అధ్యక్షులు ముద్దం కృష్ణ, ఎగితే లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మున్సిపల్ ఉద్యోగులపై వేటు...!

మున్సిపల్ రికార్డు రూమ్ వ్యవహారంలో ఆర్‌డీ ఉత్తర్వులు

నవతెలంగాణ-పరకాల

పరకాల మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్లు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ లపై సస్పెన్షన్ వేటు వేస్తూ వరంగల్ మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ షేక్ మసూద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. గత నెల 26న పరకాల మున్సిపల్ కార్యాలయంలో పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ జయంత్ లాల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్లు వెంకటరెడ్డి, శ్రీనివాసులతో కలిసి రికార్డు గదిలోకి అక్రమంగా చొరబడిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి 'నవతెలంగాణ' లో రికార్డు గదిలో కౌన్సిలర్ దౌర్జన్యం పేరుతో వార్తా కథనం వెలువడ్డ విషయం విదితమే. ఈ క్రమంలో గత నెల 29న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు రికార్డు అసిస్టెంట్లు ఇరువురిని మునిసిపల్ ఆర్డీకి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు విచారణ కమిటీ ప్రాథమిక అంచనాతో కూడిన ఓ నివేదికను మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ మసూద్ కి సమర్పించగా ఇరువురు ఉద్యోగులు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ లపై డిస్పేనరీ యాక్షన్ కింద సస్పెన్షన్ వేటుతోపాటు, మాజీ కౌన్సిలర్ జయంతి లాల్ సహా ముగ్గురిపై క్రిమినల్ చర్యలకు ఆదేశిస్తూ పరకాల మున్సిపల్ కమిషనర్ కి మెయిల్ ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం విషయమై మున్సిపల్ కమిషనర్ వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

వారంలోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

నవతెలంగాణ-సుబేదారి



జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోని 150 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను వారంలోగా ప్రారంభించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన రూట్ మ్యాపును తయారుచేసి వెంటనే అందించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని కొన్నిచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాయని, మిగతా వాటిని కూడా వారంలోగా ప్రారంభించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యపు సంచులు సరిపోను నిల్వఉంచాలని, ధాన్యం తూకంకాంటాలు సరిగా ఉన్నాయా లేదా అని ముందే చూసుకోవాలన్నారు. ధాన్యంలో తేమశాతం లేకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తేమశాతాన్ని కొలిచే మాశ్చరైజర్ మిషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. టార్పాలిన్‌కవర్లు కూడా ప్రతీ కొనుగోలు కేంద్రంవద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో పేమెంట్స్ జరగాలన్నారు. క్రమ పద్ధతిలో రైతులకు కూపన్లు అందజేయాలని, వాటి ప్రకారంగానే కొనుగోలు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్‌డీఓ మేన శ్రీను, డీఎస్‌ఓ కొమరయ్య, జిల్లా మేనేజర్ మహేందర్, డీఏఓ రవీందర్ సింగ్,శ్రీనివాస స్వామి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వం : ఎమ్మెల్యే నాయిని



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

రాజ్యాంగ స్ఫూర్తిని బీజేపీ నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం దెబ్బతీస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. రాజ్యంగ పరిరక్షణలో భాగంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలనే ఉద్దేశంతో అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించు కోవాలంటూ కాంగ్రెస్‌పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని 7,9,10వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో రాగన్న దర్వాజ నుండి రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ వారసత్వం విలువలను కాపాడ టానికి దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలను ఐక్యత సామాజిక న్యాయం సందేశంతో అనుసంధానించడానికి ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానపర్చింది బిజేపి అని ప్రపంచం మొత్తం ఆదర్శంగా భావించే మహాత్మా గాంధీని దేశ పాలకపార్టీ నెమ్మదిగా తొలగిస్తుందని అందుకే కాంగ్రెస్ ముందుకు సాగి బాబాసాహెబ్ అంబేద్కర్ మహాత్మా గాంధీ వారసత్వాన్ని కాపాడుతోందన్నారు. రాజకీయ మనుగడ కోసం మత విద్వేషాలను రెచ్చ గొడుతు రాజ్యాంగం లౌకికవాదంపై బిజేపి దాడి చేస్తోంది. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన అంబేద్కర్ ఆలోచనలను కాపాడుకుంటూ జైబాపు, జైభీమ్, జై సంవిదాన్ నినాదంతో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాస్. చీకటి శారద ఆనంద్, నెక్కొండ కల్పనకిషన్, మాజీకార్పొరేటర్లు నసీం జాహాన్, నాగరాజు, పులిరాజు, అలువాల కార్తీక్, బంక సంపత్‌యాదవ్, అంబేద్కర్ రాజు, జాఫర్, ఎస్.కుమార్ ,సైండ్ల శ్రీకాంత్, మహమ్మద్ నసీర్, హరిసింగ్, బొమ్మతి విక్రం, గుంటిస్వప్న, డి.ప్రణయ్‌దీప్,నాగ సోమేశ్వర్, ఖుర్షీద్, యాకుబ్, బి.రామకష్ణ పాల్గొన్నారు.

ఇండోర్ సబ్‌స్టేషన్లకు కార్యాచరణ రూపొందించండి

టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

నవతెలంగాణ-నక్కలగుట్ట



ఇండోర్ సబ్‌స్టేషన్లకు కార్యాచరణ రూపొందించాలని టీజీఎన్‌పిడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ మంగళవారం హన్మకొండ సర్కిల్ విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ టౌన్ పరిధిలో ఏర్పాటు చేసే కొత్త సబ్‌స్టేషన్‌లకు స్థలం కొరత ఉండడం వలన ఇండోర్ సబ్‌స్టేషన్‌లు పెట్టాలని సూచించారు. హనుమకొండ, వరంగల్, కరీంనగర్ ప్రాంతాలలో ఇండోర్ సబ్‌స్టేషన్లకు కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని, ప్రతి పనిలో సాంకేతికత అవలంభించాలని, డ్రోన్ ద్వారా పోల్ టు పోల్ సర్వే చేయించాలని, ఆ సర్వేలో సమస్యలు తొందరగా గుర్తించడం ద్వారా త్వరితగతిన పనులు జరుగుతాయన్నారు. భవిష్యత్తులో అండర్ గ్రౌండ్ కేబుల్ వేస్తామని, అత్యవసర సర్వీసులైన ప్రభుత్వ ఆసుపత్రులకు, ప్రభుత్వ కార్యాలయాలకు , ఇతర మెడికల్ సంస్థలకు 24/7 విద్యుత్ సరఫరా ఉండేటట్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.

జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా సర్కిల్‌లోని డిఈ టెక్నికల్ అధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించామని, వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాల నివారణకు విస్తత ప్రచారం కలిపించి వినియోగదారుల్లో చైతన్యం చేస్తున్నారని వివరించారు. రైతులు, వినియోగదారులు ఎట్టి పరిస్థితిల్లో సంస్థ చేయవలసిన విద్యుత్ పనులు చేయకూడదని 1912 ద్వారా సేవలు పొందవచ్చని కోరారు. వినియోగదారులకు ఉత్తమ సేవలు, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి ఎల్లపుడు నిబద్దతో పనిచేస్తూ వారితో మమేకమవ్వాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టీ.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సీఈలు రాజుచౌహాన్, తిరుమల్ రావు, హన్మకొండ ఎస్ఈ మధుసూదన్, ఎస్ఈలు శ్రీకాంత్, సురేందర్, అన్నపూర్ణ , శ్రీనివాస్, డిఈలు సాంబరెడ్డి, విజేయేందర్‌రెడ్డి, దర్శన్‌కుమార్, ఏడిఈలు నార్ల సుబ్రమణేశ్వర్‌రావు, మల్లికార్జున్, దేవేందర్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు .

పెంచిన పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

- సీపీఐ(ఎం) కాజీపేట మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



సోమవారం అర్ధరాత్రి నుండి పెరిగిన పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) కాజీపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య మాట్లాడుతూ ముడిచమురు ధరలు పెరగకపోయినా భారత ప్రభుత్వం వారి ఖజానాను నింపుకోవడానికి ప్రజలపై భారంవేస్తుండడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ప్రభుత్వం తక్షణమే ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సతమతమవుతున్న పేద ప్రజలపై ఈ భారం మూలిగే నక్కపై తాటి పండు పడ్డ విధంగా అయిందని, మూడు పూటలా వండుకొని తిందామన్న పెరిగిన ఈ గ్యాస్ ధర వలన భయపడే పరిస్థితి ఎదురవుతుందన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే గ్యాస్ ధరను తగ్గించాలని, ధనవంతులకు కార్పొరేట్ శక్తులకు వేలాది కోట్లు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం పేద ప్రజలకు ఇస్తున్న గ్యాస్ సబ్సిడీని కూడా సక్రమంగా అమలు చేయలేకపోతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ధనికుల ప్రభుత్వమని పేదలపట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్న ఈ కపట ప్రభుత్వంపై మహిళలు, సామాన్య ప్రజనికమంతా ఏకమై పోరాడాలని అన్నారు. సామాన్యుని ఎమర్జెన్సీ వాహనమైన స్కూటర్, ఆటో వారికి లీటర్ పెట్రోల్ డీజిల్ పై రెండు రూపాయల చొప్పున పెరగడం వలన అధి నిత్యం రవాణా చేసే సామాన్య ప్రజానీకంపై అధిక భారాలు పడుతున్నాయని వెంటనే ప్రభుత్వం ఈ పెంపుదలను ఉపసంహరించుకోవాలని లేనిచో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ ధర్నాలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు జంపాల రమేష్, సంటి రవి, రామంచ సారంగపాణి, పాల్, పీటర్, ప్రశాంత్, మాట్ల పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ అక్రమ దందా..!

- దృష్టిపడితే చాలు ఐతే బిజినెస్ లేదా సెటిల్మెంట్
- ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న
- మాజీ కౌన్సిలర్ బాగోతాలు

నవతెలంగాణ-పరకాల



ఆ మాజీ కౌన్సిలర్ పేరు చెబితే చాలు పరకాల పట్టణంలో నూతన గహ నిర్మాణాలు చేపట్టే వారు హడలెత్తుతున్నారు. నూతన గృహ నిర్మాణాలపై అతడి దృష్టి పడిందంటే అంతేనట. ఐతేబిజినెస్ లేదా సెటిట్‌మెంట్ రెండింటిలో ఏదో ఒకటి కావాల్సిందేనంటూ పట్టణంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రజలకు అండగా నిలవాల్సిన ఆ మాజీ ప్రజా ప్రతినిధి అక్రమ వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న తీరు పట్టణంలో చర్చానీయాంశంగా మారుతుంది. మున్సిపల్ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ దౌర్జన్యంపేరుతో 'నవతెలంగాణ' దిన పత్రికలో ఇటీవలికాలంలో కథనం వెలువడిన విషయం విదితమే. దీంతో ఆ మాజీ ప్రజాప్రతినిధి వ్యవహారాలు ఒక్కొక్కటిగా తెరమీదకు వస్తున్నాయి. ఆ నాయకుడు ఉదయం సదరు నాయకుడు ఎక్కడ ఏ నిర్మాణం జరుగుతుంది. ఏ గహ నిర్మాణం ఏ దశలో ఉంది అనేది సర్వే చేస్తారట. స్వతహాగా వ్యాపారవేత్త అయిన మాజీ కౌన్సిలర్ స్వయం సర్వే ఆధారంగా నూతన గహ నిర్మాణ యజమానులకు తన వ్యాపార సంస్థలో దొరికే పరికరాల కొనుగోలుకు ముందుగా రాయబారం నెరుపుతారనేది వినికిడి. బేరం కుదిరిందో ఓకే. లేదంటే సదరు గహస్తుకు ఇక తిప్పలు మొదలైనట్లేననేది పరకాల పట్టణంలోని పలు వార్డుల్లో వినిపిస్తున్న బహిరంగ చర్చ. కొందరు గహ నిర్మాణదారులు సదరు నాయకుడి బెదిరింపులకు తలొగ్గి అతడి ఎలక్ట్రికల్, సానిటరీ, ప్లంబింగ్ పరికరాలు కొనుగోలు చేయడం తప్పని పరిస్థితిగా తెలుస్తోంది. లేదంటే ఎంతో కొంత ముట్టజెప్పి ఆయన ఆగాడాలనుండి బయట పడాల్సి వస్తుందనే ప్రచారం. ప్రధాన రాజకీయపార్టీలో జిల్లా స్థాయి నాయకుడు కావడం, కొందరు మున్సిపల్ అధికారుల అండదండలు ఉండడంతో అతడు ఆడింది ఆట, పాడింది పాటగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఎవరైనా సదరు నేతపై ఫిర్యాదు చేయడానికి ప్రయత్నిస్తే కోరి చిక్కులు తెచ్చుకున్నట్లేననే అభిప్రాయం పట్టణవాసుల్లో నెలకొందంటే అతగాడి ఆగడాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఆ క్రమంలో జరిగిందే మున్సిపల్ కార్యాలయంలో చేసిన దౌర్జన్యంగా పలు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఆ నాయకుడి వ్యవహారాలకు పుల్ స్టాప్ పడుతుందా...? లేదా ? వేచి చూడాల్సిందే.

బీసీ ఓవర్సీస్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సుబేదారి

మహాత్మా జ్యోతిబాపూలే విదేశీ విద్యా నిధి బీసీ ఓవర్సీస్ పథకం కింద హనుమకొండ జిల్లాలోని బిసి, ఈబీసీ విద్యార్థులు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కల్పించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రాంరెడ్డి తెలిపారు. దరఖాస్తుదారు వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందినవారు **www.telanganaepass.cRR.gov.in** వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రెడ్‌క్రాస్ సొసైటీలో చైర్మన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నయీంనగర్



హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ముందుగా రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గసభ్యులు, రెడ్ క్రాస్ సిబ్బంది శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరకాల నియోజకవర్గ కార్యకర్తలు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విజయ్‌చందర్ రెడ్డి ప్రారంభించి రక్త దాతలకు సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు డాక్టర్ ఎం.శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, చెన్నమనేని జయశ్రీ, బిళ్ళ రమణ రెడ్డి, రెడ్‌క్రాస్ డాక్టర్లు జె.కిషన్‌రావు, టి.మదన్ మోహన్‌రావు, మొహమ్మద్ తహర్‌మసూద్, డాక్టర్ పగడాల కాశీప్రసాద్, టి.జయపాల్, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగార్జునరెడ్డి, కాచం గురుప్రసాద్, రాంబాబు, శ్రీ రామ్‌రెడ్డి, ముత్యాల శ్రీనివాస్, జయంత్‌లాల్, మేఘనాథ్, మొలుగూరి శ్రీనివాస్, ములక ప్రసాద్, శివకుమార్, వి.రాజ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, గాజుల నిరంజన్, జాన్ విక్రమ్, ప్రభాకర్, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ సాధించిన కొట్టే అర్పిత

నవతెలంగాణ-ధర్మసాగర్



మండల కేంద్రానికి చెందిన కొట్టే ప్రభాకర్ కూతురు కొట్టే అర్పిత ధర్మసాగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో కంప్యూటర్‌సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో విద్యనభ్యసించి పిహెచ్‌డి పట్టాపొందారు. ధర్మసాగర్ ఎస్సీ కాలనీకి చెందిన సంగాల కరుణాకర్ సతీమణి డాక్టర్ అర్పిత హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో విద్యనభ్యసించి పట్టుదలతో పిహెచ్‌డి పట్టాను పొందారు. ప్రస్తుతం అర్పిత హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో విధులు నిర్వహిస్తున్నారు. 'డెవలపింగ్ రోబస్ట్ డీప్ లెర్నింగ్ మోడల్స్ ఫర్ ప్రిసైస్ బ్రెయిన్ ట్యూమర్ డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ యూసింగ్ ఎం ఆర్ ఐ డేటా' అనే అంశం పై పరిశోధన చేశారు.

చిన్ననాటి నుండి ఏదైనా సాధించాలనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని కష్టపడి చదవడం ద్వారానే నేడు డాక్టరేట్ అవ్వడం సంతోషంగా ఉందని అర్పిత చెప్పారు. పేద కుటుంబంలో పుట్టికి పిహెచ్‌డి సాధించడంతో గ్రామస్తులు బంధువులు అర్పిత కు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఎస్‌నగర్, ఇందిరానగర్ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ





ఎంఎస్‌నగర్, ఇందిరానగర్ కాలనీల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు సంటి రవి డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) సర్వేలో భాగంగా మంగళవారం మడికొండ మెట్టుగుట్ట ప్రాంతంలోని ఎంఎస్‌నగర్, దర్గాలోని ఇందిరానగర్ కాలనీలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సంటి రవి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా మెట్టుగుట్ట ప్రాంతంలో గల ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న 300కుటుంబాలు గల కాలనీని అభివృద్ధి చేయాలని, ఇంటినెంబర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, ఇంటి పన్ను మాత్రం ఇంటి యజమాని పేరు లేకుండా హోల్డర్ అని బకాయి నోటీసులు పంపిస్తున్నారని హోల్డర్ అని లేకుండా ఇంటి యజమాని పేరును నమోదు చేసి ఇంటిపన్ను కట్టించాలని అందుకు మునిసిపల్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. మున్సిపల్ పైపులైన్ ద్వారా కాలనీకి మంచినీటి సౌకర్యం కల్పించాలని, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ కాలువలు వేయాలని, అందరికీ పట్టాలిచ్చి ఇందిరమ్మ పథకం ద్వారా పక్కా గృహాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే అన్నిరకాల సంక్షేమ పథకాలు ఎంఎస్ నగర్‌కాలనీ వాసులకు వర్తింపచేయాలని లేనిచో సీపీఐ(ఎం) పార్టీ కాజీపేట మండల కమిటీ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అక్కెళ్లి కట్టయ్య,లక్ష్మి, మంతెన పాల్ రాజ్, నాగేశ్వరరావు, సక్కుబాయి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ కాలనీలో...

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ పిలుపుమేరకు నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా మంగళవారం దర్గా లోని ఇందిరానగర్ కాలనీలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సర్వే ను ఉద్దేశించి తొట్టె మల్లేశం మాట్లాడుతూ ఇందిరా నగర్ కాలనీకి వెళ్లాలంటే రైల్వే గేట్ దాటి వెళ్లవలసి ఉందని రైళ్ల రాకపోకల సందర్భంగా గేటు మూయడం వలన ఒక్కోసారి గంటసేపు ఉండి పోవాల్సి వస్తుందని దీనివలన పనుల మీద వెళ్లే వర్కర్స్, స్కూల్ విద్యార్థులు, హాస్పిటల్ కి వెళ్లే వారు నిత్యం ఆ గేటు గుండా ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే దర్గా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఇందిరానగర్ కాలనీవాసులకు ప్రధానంగా రహదారి లేదని ఆ రహదారికి ప్రైవేటు వ్యక్తులు స్థలం ఇవ్వకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెంటనే ప్రభుత్వం ఆ ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేసి ప్రధాన రహదారిని నిర్మించాలని అన్నారు. మహిళలకు సంక్షేమ పథకాలు అమలు చేసి మహిళాభివృద్ధికి తోడ్పడాలని, కాలనీ అభివృద్ధికి ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు కషి చేయాలన్నారు. రాబోవుకాలంలో కాలనీ సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో దశలవారి పోరాటాల నిర్వహి స్తామని హెచ్చరించారు. ఈ సర్వేలో పార్టీ మండల కమిటీ సభ్యులు జంపాల రమేష్, నాయకులు పస్తం లక్ష్మణ్, చల్ల సంపత్, పద్మ కల్పన,రోజా,లావణ్య, కళ్యాణి, పత్తి రాధ పాల్గొన్నారు.

కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్



నవతెలంగాణ-భూపాలపల్లి

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం సింగరేణి ప్రధాన హాస్పిటల్‌లో ఇటీవలే నూతనంగా సీఎంఓగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కిరణ్ రాజ్‌ను గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్, ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ అన్ని ఏరియా ఆసుపత్రులలో డాక్టర్లను పూర్తిస్థాయిలో నియమించి వైద్య సేవలు అందించాలని కోరారు. ఆయన వెంట శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రెటరీ ఎస్.కె బాజీ సైదా, ఏఐటీయూసీ భూపాలపల్లి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్ లు ఉన్నారు.

అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

● మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క



నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లాలో గాలివానలకు నష్టపోయిన రైతుల పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి అందించాలని మంత్రి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తడిచిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందనీ,రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మండలాల వారికి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలనీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో, అధికారులతో పర్యటించి రైతులకు అండగా ఉండాలన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం అందిస్తామని మంత్రి సీతక్క అన్నారు.




వడగళ్ల వానతో అంతా అల్లకల్లోలం

మామిడి రైతుల ఆశలు గల్లంతు

వేలాది ఎకరాల్లో వరి పంట నష్టం

వందలాది గృహాల్లో ఎగిరిపోయిన పైకప్పులు

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం కురిసిన హెరుగాలి వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. జోరు వానలో గాలికి పైకప్పులు లేసిపోవడంతో ఇళ్లల్లో పిల్లాపాపలతో గృహిణులు చేసిన ఆర్తనాదాలు దేవుడు కూడా కనికరించలేదు. ఒకటి రెండు రోజుల్లో పోదాం అనుకున్న వరి పంట ఈరోజు కోసేందుకు అనుకూలంగా లేదు. కోసితే వరి కోత యంత్రం కూళ్లు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఇక మామిడి రైతుల బాధ చెప్పేందుకు వీలు కానిది. గత వారం రోజుల క్రితమే ఒక విడత గాలి దుమారం వాన సగం నష్టం చేయగా ఈసారి వచ్చిన వడగళ్ల వాన పూర్తి నష్టాన్ని మిగిల్చింది. రైస్ఇండస్ట్రీ ని కూడా ఈ వాన అతలాకుతలం చేసింది పసర గ్రామంలో భారత రైస్ మిల్లులో లేబర్ రెసిడెన్స్ కోసం వేసిన షెడ్లు పూర్తిగా గాలికి లేచిపోయాయి. పరం స్టోరేజీ పాయింట్ షెడ్లు కూడా ఆనవాళ్లు లేకుండా గాలికి కొట్టుకుపోయాయి సుమారు 3950 ఎకరాల్లో వరి పంట నష్టం, 135 ఎకరాల్లో మామిడి పంటలకు నష్టం వాటిలినట్టుగా మండల వ్యవసాయ ప్రధాన అధికారి కాగిత జితేందర్ రెడ్డి తెలిపారు. గ్రూపులుగా ఏరియాలలో రెవెన్యూ అధికారులతో కలిపి సర్వే నిర్వహిస్తున్నామని మరో రెండు రోజుల్లో సర్వే పూర్తి అవుతుందని అన్నారు. మండలంలో ఇప్పటివరకు 35 ఇండ్లు పైకప్పులు లేచిపోయి నట్లుగా రెవెన్యూ సర్వేలో తేలిందని రేపు కూడా ఈ సర్వే కొనసాగుతుందని ఇంకా బాధ్యులు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రెవెన్యూ తాసిల్దార్ సృజన్ కుమార్ తెలిపారు. ఒక్క గోవిందరావుపేట గ్రామంలోనే 25 కు పైగా విద్యుత్తు పోరులు దెబ్బతిన్నాయని విద్యుత్తు అధికారి వేణు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన మంగళవారం ఉదయం నుండే దెబ్బతిన్న విద్యుత్తు లైన్లను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. సంబంధిత విద్యుత్ కాంట్రాక్టర్ పాషా కూడా పూర్తిస్థాయిలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. దెబ్బతిన్న పంట పొలాలను నివాస గృహాలను మామిడి తోటలను కాంగ్రెస్ టిఆర్ఎస్ సీపీఎం పార్టీల నాయకులు పరిశీలించి రైతులను పరామర్శించి రైతులను ఆదుకోవాలని తమ డిమాండును ప్రభుత్వం ముందు ఉంచారు. కాంగ్రెస్ నాయకులు రైతులను ఆదుకుంటామని పేర్కొనగా ఎకరానికి 50 వేల రూపాయల పరిహారం అందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

వడగండ్లతో నష్టపోయిన రైతులకు ఆదుకుంటాం

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్



నవతెలంగాణ-గోవిందరావుపేట

వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులను, గృహాల యజమానులను కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో ములుగు రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేష్ తో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ తో నష్టపోయిన పంట పొలాలను ఎగిరిపోయిన ఇండ్ల పైకప్పులను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులతో అశోక్ మాట్లాడుతూ అకస్మాత్తుగా వచ్చిన సుడిగాలి వలన ఇంటి పైకప్పులు ఎగిరిపోయి నిలువ నీడ లేకుండా అయిందని, మామిడి తోటల్లో కాయలు రాలిపోయి రైతులు చాలా నష్టపోయారని, అకాల వడగండ్ల వర్షం వలన కోతకు వచ్చిన వరి ధాన్యం రాలిపోయి నీటి పాలు అయిందన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు, అలాగే ఇండ్లు కూలిపోయిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందిస్తామని, ఇప్పటికే అధికారులకు మంత్రి సీతక్క జరిగిన నష్టాన్ని పూర్తి స్థాయిలో సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు.నష్టపోయిన ప్రతి రైతు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫోటోలు, బ్యాంకు బుక్ జిరాక్స్ కాపీలు వ్యవసాయ అధికారులకు ఇస్తే మీకు తక్షణ పంట సహాయం అందిస్తామని అన్నారు. అలాగే ఇండ్లు కూలిపోయిన వారు కూడా కూలిపోయిన ఇండ్ల ఫోటో, ఆధార్ కార్డు, ఫోటోలు స్థానిక అధికారులకు అందజే యాలని, ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందిస్తాం అని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మీ అందరికీ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, అలాగే తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మాజీ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి

వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో అకాల వర్షం వడగండ్ల వానతో దెబ్బతిన్న పంట పొలాలను, మామిడి తోటలను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లాకావత్ నరసింహ నాయక్‌తో కలిసి పరిశీలించారు.నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి 50 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించాలనీ ఇల్లు కోల్పోయిన బాధితులకు 5 లక్షల తక్షణ సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, పిన్నింటి మధుసూదన్ రెడ్డి, నాం పూర్ణచందర్, మల్లేష్ గౌడ్, ఐలయ్య, తిరుపతమ్మ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేలు ఇవ్వాలి

తుమ్మల వెంకటరెడ్డి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు



వడగండ్ల వానతో మండల వ్యాప్తంగా నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి 50వేల రూపాయల పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలలో వడగండ్ల వానతో దెబ్బతిన్న ఇళ్లను పంట పొలాలను సిపిఎం పార్టీ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా తుమ్మల వెంకట్ రెడ్డి రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాట్లాడుతూ సత్వరమే వ్యవసాయ అర్టికల్చర్ రెవెన్యూ సిబ్బంది దెబ్బతిన్న పంటలను, ఇండ్లను సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తీగల ఆదిరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, చిట్టిబాబు, సీపీఎం జిల్లా నాయకులు గుండు రామస్వామి పాల్గొన్నారు.

సర్వర్ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం

ఎంసీపీఐ(యూ) పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుమారస్వామి

జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య.



నవతెలంగాణ - ములుగు

పేదరిక నిర్మూలన, సమానత్వం కోసం ఉద్యమించి ప్రాణ త్యాగం చేసిన ఎంసీపీఐ(యూ) నేత కామ్రేడ్ ఎండి. సర్వర్ ఆశయాలతో పాటు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దామని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య అన్నారు. కామ్రేడ్ ఎండి సర్వర్ 38వ వర్ధంతి సందర్భంగా మంగళవారం రామచంద్రపురం గ్రామంలో ఆయన స్మారక స్థూపం వద్ద ఎంసీపీఐ(యూ) పార్టీ నేతలు,కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి, జెండా ఎగరవేసి, పూలమాలలతో ఘన నివాళులర్పించారు. అనంతరం కుమారస్వామి, చంద్రయ్య మాట్లాడుతూ సర్వర్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయులుగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు దొంతి రాంరెడ్డి, దొంతి ప్రతాప్ రెడ్డి, బేతి రాజిరెడ్డి,సాయిరెడ్డి,రాస రాజన్న,మామిడిశెట్టి చిన్న మల్లయ్య, వడ్లూరి వెంకన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సన్న బియ్యం పంపిణీ

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



నవతెలంగాణ-భూపాలపల్లి

నిరుపేదలకు వరం సన్న బియ్యం పంపిణీ అని, ధనవంతులు తినే బియ్యమే పేదవాళ్ళు తినాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా ఆహార భద్రత కార్డు దారులకు ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కారల్ మార్క్స్ కాలనీలో లంబాడా సామాజిక వర్గానికి చెందిన భానోతు మౌనిక కిషన్ నాయక్ ఇంట్లో ప్రభుత్వం అందించిన సన్నబియ్యం భోజనాన్ని వారి కుటుంబ సభ్యులు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భోజనం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉగాదిన ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీతో పేదవారికి ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. సన్నబియ్యంతో భోజనం సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. పేదలందరికీ పూర్తి స్థాయిలో ఆహార భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ఆహార భద్రతా కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. సన్నబియ్యం లబ్దిదారుని కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం చాలా సంతోషంగా ఉందని, సంతృప్తి ఇచ్చిందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు. భోజన అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మౌనిక, కిషన్ కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం కిషన్ కుటుంబ సభ్యుల యోగక్షేమాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ... జిల్లాలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని చౌక ధరల దుకాణాలకు సన్నబియ్యం స్టాకు చేరినట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్లు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా జరిగేలా ఏర్పాట్లు చేయాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



నవతెలంగాణ-భూపాలపల్లి

యాసంగి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.

మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో రెవెన్యూ, పౌర సరఫరాలు, పౌర సరఫరాల సంస్థ, సహకార, వ్యవసాయ, డిఆర్డీఏ, తూనికలు కొలతలు, కార్మిక శాఖల అధికారులతో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పిఏసిఎస్, ఐకెపికి కేటాయించిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించాలని సూచించారు. ఏ గ్రేడ్ రకానికి 2320, బి గ్రేడ్ రకానికి 2300 మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 50 శాతం కొనుగోలు కేంద్రాలు మహిళా సమాఖ్యలకు కేటాయించాలని తెలిపారు. ఎంపిక చేసిన గ్రామ సమాఖ్యలకు ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పనకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయాల్లో పాటించాల్సిన నియమ, నిబంధనల యొక్క బ్యానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతులకు నగదు చెల్లింపు కొరకు కొనుగోలు వివరాలు ఎప్పటి కపుడు ట్యాబ్‌లలో నమోదులు చేయాలని కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్ లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో నీడ కొరకు షామియానా, తాగునీరు, ప్యాడి క్లీనర్, మాయిశ్చర్స్, తూకపు యంత్రాలు, టార్పాలిన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ శాఖ అధికారిని ఆదేశించారు. సన్నరకం, దొడ్డు రకం విడి విడిగా కొనుగోలు చేయాలని, గుర్తించడానికి వీలుగా మార్కింగ్ చేయాలని సూచించారు. సన్న రకం ధాన్యానికి బోనస్ చెల్లింపు ఉంటుందని తెలిపారు. అన్ని కేంద్రాల వివరాలు యాప్ లో రిజిస్టర్ చేయాలన్నారు. ధాన్యం వచ్చిన సెంటర్లలో ఏఈఓలచే టోకెన్ తీసుకొని వెంటనే కొనుగోలు చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాములు, డిఆర్డీఓ నరేష్, వ్యవసాయ అధికారి వీరు నాయక్, జిల్లా సహకార అధికారి వాలియా నాయక్, మార్కెటింగ్ ఎడి కనక శేఖర్, తూనికలు కొలతలు శాఖ అధికారి శ్రీలత, సహాయ కార్మిక శాఖ అధికారి వినోద తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కోసమే బాంబులు అమర్చాం

- **కర్రెగుట్టల వైపుకు ఎవరూ రావద్దు**
- **ప్రజలకు మావోయిస్టుల విజ్ఞప్తి**
- **వెంకటాపురం- వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో లేఖ**



నవతెలంగాణ-వెంకటాపురం

ప్రభుత్వం చేస్తున్న కగాంధాడి నుంచి రక్షించుకోవడం కోసమే కర్రగుట్టలపై బాంబులు అమర్చాం. సామాన్య ప్రజలు ఎవరు అటువైపు రావద్దు అంటూ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వెంకటాపురం- వాజేడు ఏరియా కార్యదర్శి శాంత పేరుతో మంగళవారం లేఖను విడుదల చేశారు. తగాన్ పేరుతో చేస్తున్న దాడుల్లో పార్టీ నాయకత్వం, పి ఎల్ జి ఏ తోపాటు, ప్రజలు బూటకపు ఎన్కౌంటర్లో అమరులవుతున్నారని లేఖలో పేర్కొన్నారు. కర్రగుట్టలపై బాంబులు అమర్చామని అటువైపు ఎవరూ రావద్దని ప్రజలకు వివిధరూపాల్లో తెలియజేశామన్నారు. అయినా కొందరు పోలీసుల మాయ మాటలకు ఇన్‌ఫార్మర్లుగా షికారుల పేరుతో కర్రెగుట్టల పైకి వస్తున్నారని పోలీసుల మాయమాటలు నమ్మి ఎవరు ఇన్ ఫార్మర్లుగా రావద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీతోపాటు ఏడవదిగా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధిస్తామని ఆమెను ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటి అమలు చేయలేదని లేక లో పేర్కొన్నారు. సామ్రాజ్యవాదులు, దళారులు నిరంకుశ పెట్టుబడిదారుల భూస్వాముల ప్రయోజనాలను నెరవేర్చడం కోసం రైతుల భూములను అటవీశాఖ అధికారులు లాక్కుంటున్నారని గుర్తు చేశారు. పోలు జాతి కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడానికి బ్రాహ్మణి హిందూ పాజిస్టు బిజెపి కగాన్ పేరుతో ప్రజలపై, ప్రజాసంఘాలపై, పార్టీపై దాడులు చేస్తుందని ఆ దాడులను కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందని లేఖలో పేర్కొన్నారు.

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలి

సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-భూపాలపల్లి

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం వంట సిలిండర్ గ్యాస్ ధర 50 రూపాయలు పెంచడం దారుణమన్నారు. ధరలను అదుపు చేయలేని కేంద్ర ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం నిత్యవసల ధరలను పెంచుకుంటూ పేద ప్రజలను రోడ్డు మీద పడేలా చేస్తుందన్నారు. వెంటనే గ్యాస్ సిలిండర్ ధరలను, నిత్యవ సరాల ధరలను తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వేములశ్రీకాంత్,నేరెళ్ల జోసెఫ్, అస్లాం, మంచినీళ్ల వైకుంఠం, దొంతర బోయిన హరీష్ శివ కృష్ణ, మేడి శేఖర్,గోలి లావణ్య, పుప్పాల వనిత, గడ్డం సరూప, పల్లెల రజిత, వాసం రజిత, పోతుగంటి స్వప్న పాల్గొన్నారు.

ఎంజీఎం హైస్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు



నవతెలంగాణ-గణపురం

చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎంజీఎం హైస్కూల్ లో మంగళవారం గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా 2024 -2025 విద్యాసంవత్సరానికి గాను ప్రీ ప్రైమరీ యూకేజీ క్లాస్ విద్యార్థులు ,ప్రైమరీ ఫస్ట్ క్లాస్ లో అదేవిధంగా ప్రైమరీ 5వతరగతి విద్యార్థులు హైస్కూల్ 6వ తరగతి లోకి ప్రవేశిస్తున్న తరుణంలో విద్యార్థులకు క్యుమిలేటివ్ రికార్డ్ తో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రీ ప్రైమరీ కి నూతన పాఠశాల గదులు ఏర్పరిచి అత్యాధునిక మౌళిక సదుపాయాలతో "గో బ్యాక్ టు నేచర్" అనే నినాదంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలనే సదుద్దేశంతో నూతన గదుల ప్రారంభోత్సవ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గ్యాదంగి సతీష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదల, వినయం, విధేయతతో చదువునభ్యసించాలని కోరారు. ఈ పాఠశాలలో చదివే చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరప్రదాయనిగా ఉంటూ ఎంతోమంది మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తుందని అన్నారు. అన్ని తరగతుల విద్యార్థులకు ఐటీ టాపర్స్ అకాడమీ, విశ్వం ఎడ్యూటెక్ అబాకస్ వారు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి, గ్యాదంగి రమాదేవి, సిలువేరు శ్రీనివాస్ ,ప్రిన్సిపల్ మధుకర్, జిజు భాయ్ ట్రైనర్ రమ్యకృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కర్రెగుట్ట భద్రతపై పటిష్టమైన చర్యలు

● రక్షణ పేరుతో అమాయక ప్రాణాలు బలికొంటున్న మావోలు

● జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ పి



నవతెలంగాణ - ములుగు

సీపిఐ మావోయిస్టులు రక్షణ పేరుతో కర్రెగుట్టపై ప్రెషర్ మైన్స్ అమర్చి అమాయక ప్రజల ప్రాణాలు బలి కొంటున్ననీ,కర్రెగుట్ట భద్రతపై ములుగు పోలీస్ లు పటిష్టమైన చర్యలు చేపడుతున్నరని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ పి అన్నారు. ప్రభుత్వ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ తెలంగాణలోని దాని ప్రాబల్యం పూర్తిగా తుడిచి పెట్టుకొని పోయిందనీ, మావోయిస్టు పార్టీకి ప్రజలలో ఎటువంటి ఆదరణ లేదనీ, ఆ పార్టీ సిద్ధాంతాలను ప్రజలు ఎవరు నమ్మడం లేదన్నారు. మావోయిస్టు పార్టీ కేవలం తన ఉనికిని చాటుకోవడానికి, ఆ పార్టీ నాయకుల స్వ ప్రయోజనాల కోసం జిల్లాలోని వెంకటాపురం, వాజేడు మండలాల్లోని సరిహద్దు కర్రెగుట్ట ఆటవి ప్రాంతంలో మావోయిస్టుల మతిభ్రమించి రక్షణ పేరుతో ప్రజలు నిత్యం తిరిగే ప్రదేశాలలో ప్రెషర్ మైన్స్ పెట్టి వారి ప్రాణాలు బలిగొంటున్నారన్నారు. పౌర హక్కుల సంఘాలు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా మావోయిస్టుల చర్యలను ఖండిచాలని వారిని కోరడం జరుగిందన్నారు. సిపిఐ మావోయిస్టులు అమర్చినటువంటి ప్రెషర్ మైన్స్‌ను వెంటనే వారు వాటిని తొలగించాలి, సరిహద్దు గ్రామాలలోని ప్రజలు ఎవరు భయపడకూడదని ప్రజల భద్రతపై ములుగు పోలీస్ పటిష్టమైన భద్రతపరమైన చర్యలు తీసుకుంటుందని, నిత్యం బాంబు నిర్వీర్యం చేసే బృందాలతో కర్రెగుట్ట పై తనిఖీలు చేస్తూ మావోయిస్టులు అమర్చినట్టువంటి ప్రేషర్ మైన్స్ ఎప్పటికప్పుడు తొలగిస్తుందని, అనుమానాస్పదంగా ఆటవి ప్రాంతంలో మైన్స్ కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.



రాజ్యాంగ విలువలను కాపాడాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

నవతెలంగాణ-భూపాలపల్లి

భారత రాజ్యాంగ విలువలను కాపా డాలని ఎమ్మెల్యే గంటల సత్యనారాయణ రావు అన్నారు. మంగళ వారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహి ంచిన జై భీమ్, జై బాపూ, జై సంవీధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. ముందుగా బాపూజీ, అంబేద్కర్, భారత రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు ఎమ్మెల్యే పూల మాల వేసి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. పాదయాత్ర సాగుతున్న క్రమంలో కాలనీ వాసులు కొంతమంది వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. త్వరిత గతిన సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే సూచిం చారు. ఈ యాత్రలో పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను పభుత్వం ఆదుకోవాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరీక గోవింద్ నాయక్



నవతెలంగాణ-ములుగు

సోమవారం కురిసిన వడగళ్ల వానతో జిల్లాలో రైతులు నష్టపోయారని, కొన్ని చోట్ల ఇల్లు సైతంపై కప్పులు లేచిపోయాయని వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరీక గోవింద్ నాయక్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా జిల్లాలో వరి, మిర్చి, మొక్క జొన్న, మామిడి, బొప్పాయి ఇంకా అనేక రకాల పంటలు వేసి వ్యవసాయం చేసుకునే రైతులు పంట చేతికి వచ్చే సమయానికి అకారణంగా నిన్న సాయంత్రం పెద్ద ఎత్తున ఈదురు గాలులతో కురిసిన వర్షం వల్ల రైతులు నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆ రైతులను పరామర్శించి అధికారులచే పంట నష్టాన్ని అంచనా వేసి త్వరితగతిన దెబ్బతిన్న అన్ని పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పంట నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, రైతులకు అండగా నిలిచీ ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి తెలిపారు.

మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలి :డీపీఓ



నవతెలంగాణ-గణపురం

గ్రామాల్లో మంచినీటి ఎద్ద డి లేకుండా చూడాలని డిపిఓ నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాల యాన్ని పరిశీలించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా ప్రతి వీధికి మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డ్రైనేజీలు ఎప్పటికప్పుడు క్లీన్ చేసుకోవాలన్నారు. వీధిలైట్లు లేని చోట ఏర్పాటు చేయాలన్నారు. జీపి సిబ్బంది జీతం ఎప్పటికప్పుడు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజేందర్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



నవతెలంగాణ-మల్హర్‌రావు

పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు వందశాతం పరిస్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం మండలం లో రుద్రారం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మిక సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు,మండల విద్యాశాఖ అధికారి లక్ష్మన్ బాబు,ఉపాధ్యాయులు, పిఆర్టియు భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు సుబాకర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్,రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ పాల్ రెడ్డిలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

- సీజీఎఫ్ఆర్ వన్ చైర్మన్ వేణుగోపాలచారి

నవతెలంగాణ-లింగాలఘణపురం



విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించ డంతోపాటు నాణ్యమైన విద్యుత్తు అందించడమే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ప్రధాన లక్ష్యమని సిజీఎఫ్ఆర్ చైర్మన్ ఎన్పీడీసీఎల్ ఎస్వి వేణుగోపాలచారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం దేవర్పుల సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని రైతులు విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను సమావేశం దష్టికి తీసుకొచ్చారు. 38 మంది రైతులు గ్రామాలలో వ్యవసాయ బావుల వద్ద నెలకొన్న ప్రధాన సమస్యలు కిందికి వేలాడుతున్న లూజ్ లైన్లు ట్రాన్స్ఫార్మర్ల అధిక లోడు సమస్య, ఇనుప స్తంభాల, కరెంట్ బిల్లులపై పేరు మార్పిడి, ఎక్కువ బిల్లులు వస్తున్నాయన్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిందికి వేలాడుతున్న లూజ్ లైన్ల కింద మిడిల్ స్తంభాలు ఇప్పిస్తామని అధికలోడు సమస్య పరిష్కారం కోసం అదనపు ట్రాన్స్ఫార్మర్లను మంజూరు చేస్తామని ఇనుప స్తంభాల మారుస్తామని అధిక కరెంట్ బిల్లును సవరిస్తామని అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేస్తామన్నారు. వినియోదారులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ విద్యుత్ వాడకాలను నివారించాలని కోరారు.

ఈ సమావేశంలో సిజీఎఫ్ఆర్ బృందం చరణ్‌దాస్, రమేష్, రామారావు, జనగామ డివిజన్ డిఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఏడిఈ అనిల్, ఏఈలు శంకరయ్య, నరసింహారెడ్డి, నరసింహులు, సబ్ ఇంజనీర్లు, ఫోర్ మెన్లు, లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్ మెన్లు, ఏఎల్ఎంలు, జేఎల్ఎంలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-లింగాలఘనపురం



సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, వేసవి సెలవు దినాలలో విద్యార్థిని విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని జనగామ రూరల్ పోలీస్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ దుడిమెట్ల నరేష్‌యాదవ్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం రఘునాథపల్లి మండలం కంచనపెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని మరికొందరికి అవగాహన కల్పించాలని అన్నారు. చదువుకున్న వాళ్లు కూడా ఇటీవల సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారని ఆందోళన కలిగిస్తుంది అన్నారు. కొరియర్ పేరుతోను మోసాలు జరుగుతున్నాయన్నారు. లోన్‌యాప్ లాటరీల పేరుతోను డెబిట్ కార్డ్ మోసాలుకు జరుగుతున్నాయని వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో ఫేక్‌ఫోటోలను చూపి ఆకర్షణలోనై మోసపోతున్నారన్నారు. నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరగాల నుండి ఫోన్ వస్తే సమాచారం పోలీసులకు ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులు వాహనాలు నడపవద్దని త్రిబుల్ రైడ్ చేయవద్దని వేసవి సెలవుల్లో చెరువులో ఈతకు పోవద్దని సూచించారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

నవతెలంగాణ-లింగాలఘణపురం



రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలని సిపిఐ మండల కార్యదర్శి రావుల సదానందం డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పటేల్‌గూడెం సిపిఐ గ్రామశాఖ అనుముల మల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ మండల కార్యదర్శి రావుల సదానంద్ హాజరై మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలి వ్యాపారస్తులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నందున రైతుల నష్టపోతున్నారు. రైతులు ఆరునెలల పాటు ఎండనక వాననక కష్టపడి పంట చేతికి రాగానే వ్యాపారస్తులు రైతుల కష్టాన్నిసొమ్ముచేసుకోవడం ఇది చాలా శోచనీయమైన విషయం కాబట్టి ప్రభుత్వం గ్రామాలలో ఐకెపి సెంటర్లు త్వరతంగా ప్రారంభించి రైతుల పంటను కొనుగోలు చేయాలని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు . గ్రామ శాఖ జనరల్ సెక్రటరీగా పొన్నాల మహిపాల్ రెడ్డి జాయింట్ సెక్రటరీగా నకిరెడ్డి యాదగిరిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సమావేశంలో నాగయ్య, రామకష్ణ, రాజు, నరసయ్య, సోమయ్య, మల్లయ్య, బాల్ రెడ్డి, సోమయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బియ్యం పంపిణీ

నవతెలంగాణ-లింగాలఘణపురం

మండల కేంద్రానికి చెందిన ఎముల ముత్తయ్య ఇటీవల మృతి చెందగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ సంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గుగ్గిళ్ళ నర్సయ్య వారి కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యాన్ని అందించారు. ఈ పరామర్శలో బుట్ రెడ్డి రాజిరెడ్డి, బెజ్జం ఆంజనేయులు, పడితే రాజశేఖర్, తుడి కలమ్మ, వెంకటేష్, మేడ రవి, గ్యార చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సన్న బియ్యం ఒక వరం లాంటిది

నవతెలంగాణ-కొడకండ్ల



పేదలకు ప్రజా పంపిణీ ద్వారా అందించే ఉచిత సన్నబియ్యం ఒక వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధారావత్ సురేష్‌నాయక్ అన్నారు. మంగళవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి, ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని మొండ్రాయి గ్రామంలో ఉన్న ప్రజా పంపిణీ రేషన్ దుకాణంలో సన్నబియ్యం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం పేదలకు ఉచిత బియ్యాన్ని అందించడం జరుగుతుందని పేదలు కడుపునిండా అన్నం తిని ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం అధ్యక్షునికి సన్మానం

నవతెలంగాణ-కొడకండ్ల

పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్ష స్థానానికి ఎన్ని కల నిర్వహించగా మస్త్రం రవీందర్ నియామకం కావడంతో ఆయనను కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు ధారావత్ రాజేష్ నాయక్ ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

నవతెలంగాణ-కొడకండ్ల



కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారం మోపి గ్యాస్ ధరలను పెంచిందని వెంటనే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్ల అండాలు శ్రీరామ్ డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలందరికీ 500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్న సమయంలో గ్యాస్ ధరలు పెంచడం విడ్డూరం అన్నారు. వెంటనే కేంద్రం పెంచిన గ్యాస్‌సిలిండర్ల ధరలపై తగ్గించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కెట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పల్లా అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

నవతెలంగాణ-జనగామ

ప్రజా నాయకుడు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అనుచిత వాక్యాలు మానుకోవాలని డిసిసి కార్యదర్శి మంద రమేష్ హితవు పలికారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. అవినీతి అక్రమ సొమ్ముతో ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి అవినీతి మరకలేని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించడం సిగ్గుచేటన్నారు.అనాగరికంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంజిరెడ్డి, రచ్చ సోమనాదం, నాయకులు జీడికంటిరాజకుమార్,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-జనగామ



పట్టణంలో ధర్మకంచ మినీస్టేడియం ఓపెన్ జిమ్ పక్కన అక్ర మంగా నిర్మించిన రేకుల ఇళ్ళను తొలగించాలని సీపీఐ(ఎం) జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ(ఎం) బృందం పట్టణంలోని ధర్మకంచ ఏరియాలో అక్రమ నిర్మాణాలు జరిగిన ప్రాంతాన్ని ఇండ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ జనగామ పట్టణంలో యువత శారీరక దేహదారుణ్యం కోసం మినీస్టేడియం ఎదురుగా ఉన్న స్థలంలో ఓపెన్ జిమ్ నిర్మాణం ప్రభుత్వం చేపట్టిందని మిగిలి ఉన్న స్థలంలో చిన్న పిల్లల, మహిళల, బాలింతల కోసం అంగన్వాడి కేంద్రం నిర్మిస్తామని గతంలో అధికారులు ఈ స్థలాన్నిపరిశీలించి వెళ్లారన్నారు. ఈ స్థలాన్ని ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారని తెలిపారు. ఇల్లు కట్టుకున్న వారు పేదలు పేద కుటుంబానికి చెందిన వారు అయితే వారికి వేరే స్థలంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇచ్చి ఈ స్థలాన్ని ఖాళీ చేయించారని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కమిటీ సభ్యులు బొట్ల శ్రావణ్, పల్లెర్ల లలిత, పాము శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- 25 శాతం రాయితీని సద్వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

నవతెలంగాణ-జనగామ



ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈ నెల 14 వరకు రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ అన్నారు. మంగళవారం, జిల్లా కేంద్రంలోని పురపాలిక కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్‌ఆకస్మికంగా తనిఖీ చేసి, సమీక్షించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల ప్లాట్ ల క్రమబద్ధీకరణ ఆన్‌లైన్ విధానాన్ని నిశితంగా పర్యవేక్షించి, సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో ఇప్పటివరకు స్వీకరించిన ఆన్‌లైన్ దరఖాస్తుల విషయాలపై ఆరా తీశారు. జిల్లాలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద వచ్చిన దరఖాస్తుదారుల భూముల పరిశీలనను వేగంగా చేపట్టాలని, అభ్యంతరాలు లేని వాటికి త్వరితగతిన ప్రొసీడింగ్స్ జారీచేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ రాయితీని వినియోగించుకునేలా దరఖాస్తుదారులకు చరవాణి ద్వారా మరోసారి అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు రాయితీ గడువును పెంచినందున దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్ కింద పూర్తిస్థాయి రుసుములు చెల్లించి, భూముల క్రమబద్ధీకరణ చేసుకోవాలని కోరారు. ఈ మేరకు రుసుము చెల్లించిన వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీని వర్తింపజేస్తోందని ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు వినియోగించుకొని లబ్ధి పొందాలని తెలిపారు.

అనంతరం రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు ఆహార భద్రతకార్డు (రేషన్‌కార్డు) ఉంటే ఆదాయ ధృవీకరణపత్రం అవసరం లేదని కలెక్టర్ వెల్లడించారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకాన్ని నూతనంగా ప్రారంభించిందన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతీ, యు వకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. నిరుద్యోగులు స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకొని, తమ ఆర్థికపరిస్థితిని మెరుగుపరుచుకోవాలని, యువతకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసేందుకు ప్రవేశపెట్టిన ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 14వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో https://tgobmms.cgg.gov.in లో దరఖాస్తు చేసుకొని, అందుకు సంబంధించిన ధృవపత్రాలను మునిసిపల్, ఎంపిడిఓ కార్యాలయల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సహాయ కేంద్రంలోనూ అందజేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎస్సీడీఓ విక్రమ్, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, టీపీఎస్ ప్రశాంతి, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి



నవతెలంగాణ-జనగామ

రాష్ట్రవ్యాప్తంగా నెలకొని ఉన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్ మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా 4 వ మహాసభలు స్థానిక విజయ ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్ఎల్.మూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్య విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో సంస్కరణల పేరుతో 'యూజీసీ' రూపొందించిన ముసాయిదా అమల్లోకి వస్తే విశ్వవిద్యాలయాలు కేంద్ర ప్రభుత్వం గుప్పిట్లోకి వెళతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాల హక్కులను హరించడానికే కేంద్రం ప్రభుత్వం ఈ ముసాయిదా తీసుకవచ్చిందని, దీన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టలలో అనేక సమస్యలు ఉన్న ప్రభుత్వం కి సోయి లేదు అన్నారు. అదేవిధంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం చూపడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలైందన్నారు.

రాబోయే రోజుల్లో విద్యారంగ సమస్యలు పరిష్కారం చూపక పోతే ఉద్యమాలు చేస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దమెర కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు ధర్మభిక్షం, సందీప్, జిల్లా నాయకులు సుమా, యకాన్న, ఆర్య, మురళి, రమేష్, కష్ణ, కీర్తన, హరిత తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలోకేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ-జనగామ



పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) జనగామ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలపెంపుకు నిరసనగా మంగళవారం పట్టణంలోని నెహ్రూపార్కు వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యాస్ ధర పెంచడం వలన నిత్యావసర సరుకుల ధరలు అన్ని పెరుగుతాయి అన్నారు. దీనివల్ల సాధారణ ప్రజలపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య పేద మధ్యతరగతి వారు గ్యాస్‌ధర చూస్తే కట్టెలపోయే మేలు అనేటువంటి పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. గ్యాస్ ద్వారా ప్రజల వల్ల పెట్రోల్ డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని పెంచిందన్నారు. దీని ద్వారా సామాన్య ప్రజలపై పెనుభారం పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుస రిస్తున్న విధానం ద్వారా దేశంలో నిత్యావసర సరుకులు రోజు రోజుకు పెరుగుతున్నాయన్నారు. దీని ద్వారా సామాన్యులపై అధిక భారం పెరుగుతుందన్నారు.

ఇప్పటికైనా పెంచిన పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను తగ్గించాలని, లేకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుద్దామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జనగాం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, భూక్య చందు నాయక్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, పల్లెర్ల లలిత, బొట్ల శ్రావణ్, మంగ బీరయ్య, పాము శ్రీకాంత్, శాఖ కార్యదర్శిలు భూనాద్రి వెంకటేష్, గంగరబోయిన మల్లేష్‌రాజ్, సాంబరాజు దుర్గాప్రసాద్, కుమార్, మాదా సుధాకర్, బండ సౌందర్య, అజ్మీర సురేష్ నాయక్, లక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అందని కమీషన్లు

మూడు సీజన్లకు ఐదు కోట్ల బకాయిలు

కమిషన్ల కోసం కొనుగోలు కేంద్రాల నిర్వహకుల ఎదురుచూపు



నవతెలంగాణ-పాలకుర్తి

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు కమిషన్లు అందకపోవడంతో కొనుగోలు కేంద్రాల మహిళలు ఆవేదన చెందుతున్నారు. 2023-24 లో ఖరీఫ్, రబీ సీజన్లు, 2024-25 ఖరీఫ్ సీజన్ల కొనుగోలు కేంద్రాల కమిషన్ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో కొనుగోలు కేంద్రాల మహిళలకు ఆర్థిక భారం తప్పడం లేదు. జిల్లాలో ఐకెపి ఆధ్వర్యంలో 185 కొనుగోలు కేంద్రాలసెంటర్లు, సొసైటీల ఆధ్వర్యంలో 101 కొనుగోలు కేంద్రాలసెంటర్ల ద్వారా ధాన్యాన్ని సేకరించారు. మూడు సీజన్లకు కలిపి ఐకెపి, సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు ధాన్యం కమిషన్ సుమారు రూ.5కోట్లు బకాయిలు ఉండగా బకాయిలు అందకపోవడం గమన హారం. కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.32లు కమిషన్ చెల్లిస్తుంది. గ్రామైక్య సంఘానికి 45శాతం, కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు 45 శాతం, జిల్లా సమైక్యకు 10శాతం వాటా ఉంటుంది. అనేక ఇబ్బందులతో ధాన్యాన్ని సేకరించే నిర్వాహకులకు ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎగుమ తులు చేస్తారు. సన్న రకం ధాన్యాన్ని సాగు చేయాలని ప్రభుత్వం రైతులను ప్రోత్సహించడంతో ప్రభుత్వం సన్నరకం ధాన్యం సేకరణకు ప్రత్యేక కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ రవి సీజన్లో ఐకెపి ఆధ్వర్యంలో 109 దొడ్డు రకం ధాన్యం సేకరణ కేంద్రాలు, 65సన్నరకం దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా సొసైటీ ఆధ్వర్యంలో 66 దొడ్డు రకం ధాన్యం సేకరణకు, 35 సన్న రకం ధాన్యం కొనుగోలు సేకరణకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే కమిషన్లతో మహిళ సాధికారిక కు తోడ్పడటంతో పాటు మహిళా సంఘాలకు ఆర్థిక వనరులు సమకూర్చేందుకు దోహదపడతాయి. సొసైటీల అభివృద్ధికి, వ్యాపారాల నిర్వహణకు, రైతులకు సకాలంలో ఎరువులు అందించేందుకు కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే కమిషన్లు ఉపయోగపడతాయి. మూడు సీజన్లకు కమిషన్లు అందకపోవడంతో కమిషన్ల కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిన వెంటనే కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు ప్రభుత్వం కమిషన్లను అందజేయాలని కోరుతున్నారు.

నిర్వాహకులకు కమిషన్లు అందిస్తాం : వసంత, పీడీ డిఆర్‌డిఓ

జిల్లాలో ఐకెపి ఆధ్వర్యంలో, సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు మూడు సీజన్లలో ఉన్న బకాయి కమిషన్లను అందించేందుకు కృషి చేస్తాం. మూడు సీజన్ల బకాయిలు ఉన్నాయని, బకాయిల విడుదల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించామని తెలిపారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన వెంటనే బకాయిలను అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. కమిషన్ల బకాయిల పేరుతో ధాన్యం కొనుగోళ్లపట్ల నిర్లక్ష్యం వహించరాదని నిర్వాహకులకు సూచించారు.

వేసవిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటి సమస్య తలెత్తకుండా నివారణ చర్యలు చేపట్టాలని, మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు.



స్వయం ఉపాధికి ఊతం... రాజీవ్‌యువ వికాసం

- ఈనెల 14 వరకు గడువు పొడగింపు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



నిరుద్యోగ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఆసక్తి ఉన్నవారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటే 50 వేల నుంచి 4 లక్షల వరకు ప్రభుత్వం రుణాలను అందిస్తోంది. వివిధ స్థాయి రుణాలను బట్టి 100శాతం నుంచి 70శాతం వరకు సబ్సిడీ అందిస్తోంది. ప్రస్తుతం ఆదాయ ధ్రువపత్రం లేకున్నా రేషన్ కార్డుతో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు కల్పించింది.నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకానికి ఇటీవల శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అర్హత ఆధారంగా తీసుకునే రుణాన్ని బట్టి 70 నుంచి 100శాతం సబ్సిడీ పొందే అవకాశం ఉంది. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చే బ్యాంకు రుణంతో పాటు సొంత వ్యాపారం, చిరు వ్యాపారాలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు గేదలు, కోళ్ల మైనర్ ఇరిగేషన్లను బట్టి లబ్ధి పొందే వెసులుబాటును కల్పించింది. ఆర్థిక పరిస్థితి, కుటుంబ నేపథ్యం, విద్యార్హతలు, వయసును దష్టిలో పెట్టుకొని లబ్ధిదారులను ఎంపిక చేయనుంది. ఆదాయ ధ్రువపత్రం లేకున్నా రేషన్ కార్డుతో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 14వ తేదీ వరకు గడువు పొడిగించింది.

10 వేలు దాటిన దరఖాస్తులు...

జనగామ జిల్లాలోని 12 మండలాల్లో ఇప్పటివరకు రాజీవ్ యువ వికాసం పథకానికి వెనుకబడిన తరగతుల అభ్యర్థుల నుండి దాదాపు 10 వేల వరకు దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా బిసి కార్పొరేషన్ అభివృద్ధి అధికారి రవీందర్ మంగళవారం తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత గల లబ్ధిదారులు ప్రభుత్వ ఏర్పాటు చేసిన వెబ్ పోర్టల్ లో నుంచి దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకొని అవసరమైన ధ్రువపత్రాలతో గ్రామీణ ప్రాంతాల వారు ఎంపీడీవో కార్యాలయాల్లోనూ, పట్టణ ప్రాంతం వారు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే సంబంధిత కార్యాలయాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తుదారులు ఆదాయద్రోపత్రం లేకున్నా రేషన్ కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చని, కుటుంబంలో ఒకరు మాత్రమే ఈ పథకానికి అర్హులని రవీందర్ పేర్కొన్నారు.

మహిళను కుటుంబానికి అప్పగించిన సఖి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

పది రోజుల క్రితం జిల్లాలోని లింగాల గణపురం పోలీస్ స్టేషన్ నుండి సఖి కేంద్రానికి తీసుకువచ్చిన మాటలు రాని తప్పిపోయిన బాధిత మహిళను నిర్వాహకులు మంగళవారం ఆమె భర్తకు అప్పజెప్పారు. ఈ పది రోజుల పాటు తనను కాపాడినందుకు బాధిత మహిళ కృతజ్ఞతలు తెలిపారు. మాటలు రాక, ఆరోగ్యం బాగాలేక, హాస్పిటల్, సఖి కేంద్రానికి తిప్పుతూ సఖి సిబ్బంది చాలా ఆందోళనకు గురవుతూ, బాధితురాలు ఆశించినట్లు తన భర్త తనను వెతుక్కుంటూ రావడం అతనికి అప్పచెప్పడం ఎంతో సంతోషాన్నిచ్చింది.

మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలి

- మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి విక్రం

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



జనగామ జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసులో మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ విక్రం ఆధ్వర్యంలో రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన మం గళవారం అన్ని పార్టీల మైనార్టీ లీడర్స్, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు, మజీద్ అధ్యక్షులు సోషల్ వర్కర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మాట్లాడుతూ పేద ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు పథకాన్ని సద్వినియం చేసుకోవాలని, ముస్లిం మైనార్టీలకు జనగామ జిల్లాకు 12. 50 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీకి 18 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోపూర్తి విధి విధానాలను తెలుపుతామన్నారు. చివరి తేదీ ఈనెల 14 వరకు ఉందని, ఆన్లైన్ ద్వారా గాని ఆఫ్ లైన్ ద్వారా గాని దరఖాస్తు చేసుకోగలరని, దరఖాస్తు ఫారాలు వెబ్సైట్లో గాని మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసులో గాని తీసుకోగలరని, ఏమైనా సందేహాలు ఉంటే కలెక్టర్ ఆఫీస్ నందు మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయం 2వఫ్లోర్‌లో సంప్రదించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ముస్లిం డెవలప్మెంట్ అధ్యక్షులు మహమ్మద్ జమాల్ షరీఫ్, హం సాత్ ఫౌండేషన్ అధ్యక్షులు మహమ్మద్ యాకుబ్ పాషా, భూరాన్, సిరాజ్, అబిద్ ఫైసల్, నార్మట చర్చి పాస్టర్ రెవ.దేవదానం, వరల్డ్ క్రిస్టియన్ కౌన్సిల్ తెలంగాణ స్టేట్ రాజకుమార్ రోడ్రిక్స్, జనగామ ప్రాపర్టీ పెసిడెంట్ దామెర జేమ్స్, జనరల్ సెక్రటరీ రామావత్ చిన్న, యూనిక్యూ చర్చి పాస్టర్ రామగాళ్ల కలెబ్, ఇక్బాల్, ఇస్మాయిల్, అలీం, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ధాన్యానికి కనీసం మద్దతు ధర కల్పించాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి చందు నాయక్



నవతెలంగాణ-జనగామ

జనగామ మార్కెట్ యార్డులోకి రైతులు తీసుకువచ్చిన ధాన్యానికి కనీసం మద్దతు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందునాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టరేట్ సూపరింటెంట్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చందు నాయక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు త్వరితగతిన ప్రారంభించి, కనీస సౌకర్యాలు, గన్ని బ్యాగులకొరత, రవాణాసమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి అన్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని, అలాగే మార్కెట్ పరిధిలో సీసీఐ కొనుగోలులో జరిగిన అవినీతిపైన, పల్లికాయ కొనుగోలులో సిఎంఆర్ జరిగిన అవినీతి పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే బియ్యం ప్రభుత్వానికి ఇవ్వకుండా కోట్లు కొల్లగొట్టిన నెల్లుట్ల మణికంఠ రైస్ మిల్లును బ్లాక్ లిస్ట్ లో పెట్టాలనీ డిమాండ్ చేశారు. జనగామ మార్కెట్లో రైతులకు ఉచిత భోజన సదుపాయం కల్పించాలని, మార్కెట్‌లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలోని ఎరువులు, విత్తనాలు క్రిమిసంహారక మందులువిక్రయించే ఫర్టిలైజర్స్ యజమానులు కల్తీ విత్తనాలు విక్రయించకుండా ప్రతి షాప్ లో విక్రయిస్తున్న వస్తువుల పేరు, ధరలతో కూడిన సూచిక ఏర్పాటు చేయాలన్నారు.

జనగాం మార్కెట్లో పరిధిలో అడ్తి దారులు, ,ఖరీదు దారులు అందరూ విధిగా బిడ్డింగ్‌లో పాల్గొనే విధంగా, మార్కెట్ కు వచ్చిన ప్రతి సరుకు ఈ నామ్ ద్వారా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైస్‌మిల్లు వద్ద యజమానులు నేరుగా ధాన్యం కొనుగోలు చేపట్టడం అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ జిల్లా కార్యదర్శి అజ్మీరా సురేష్‌నాయక్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంగ బీరయ్య, జిల్లాకమిటీ సభ్యులు బోడ రాములు, ఉర్సుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

నవతెలంగాణ-మరిపెడ(నరసింహులపేట)



ఖమ్మం జిల్లాలో ఈనెల 25, 26, 27 తేదీలలో జరగబోయే ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గంధసిరి జ్యోతిబాసు, అన్నారు. బుధవారం నర్సింహులపేట మండల కేంద్రంలోని మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంధసిరి జ్యోతిబసు మాట్లాడుతూ బఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున విద్యార్థులు అందరూ పాల్గొనాలని కోరుతున్నాము. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నర్సింహులపేట మండల నాయకులు యాకుబ్, నర్సింహా, పవన్, రాజేష్ విద్యార్థులు మనీషా, సుప్రజ, మౌనిక రేష్మ, తరుణ్, ప్రణయ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

మిర్చి కొనుగోళ్లు ఆలస్యం

● స్పందించిన చైర్మన్, కార్యదర్శి

నవతెలంగాణ-మహబూబాబాద్



మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు, సకాలంలో వచ్చి మిర్చితో పాటు ఇతర పంటల ఉత్పత్తులు కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. మంగళవారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుణిగంటి రాజన్న, జిల్లా ఉపాధ్యక్షులు నల్ల సుధాకర్ ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేశారు. తక్షణమే వ్యాపారలందరూ రావాలని తడిసిన మిర్చి తో పాటు అన్ని మిర్చి బస్తాలు కొనుగోలు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. గత రెండు రోజుల క్రితం వచ్చిన మిర్చి కొనుగోలు చేయడంలో ఆలస్యం కావడం వలన అకాల వర్షానికి తడిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, కార్యదర్శి షంషేర్ రైతుల వద్దకు వచ్చి చర్చలు నిర్వహించారు. వ్యాపారులకు ఫోన్ చేసి పిలిపించి వేలం పాటలు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రైతులు రమేష్, బాలు నాయక్, శ్రీను, సర్వన్ వెంకన్న, మంగీలాల్‌లు పాల్గొన్నారు.

భవిష్యత్ బీఆర్ఎస్ గులాబీ పార్టీదే



● మాజీ ఎమ్మెల్యే భానోత్ హరిప్రియా

నవతెలంగాణ-బయ్యారం:

తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్తు బీఆర్ఎస్ గులాబీ పార్టీదేనని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే భానోత్ హరిప్రియానాయక్ అన్నారు. ఏప్రిల్ 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో జరగబోయే భారత రాష్ట్ర సమితి 25వ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని బయ్యారం మండలం గంధంపల్లిలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాతా గణేష్ ఆధ్వర్యంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ విజయోత్సవ సన్నాహక కార్యక్రమానికి ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే హరిప్రియా నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై బయ్యారం మండల పార్టీ ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హరిప్రియా నాయక్, మండల పార్టీ అధ్యక్షులు తాతా గణేష్, మండల పార్టీ నాయకులు మాట్లాడుతూ గులాబీ పార్టీ 25వ వసంతాల సంబరాల నిర్వహణ పై ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై పని చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత మొదటి సారిగా బీఆర్ఎస్ అధినేత, తొలి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించబోయే తొలి సభకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల సొసైటీ వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు బానోత్ మురళీకృష్ణ, ఆత్మకమిటి జిల్లా మెంబర్ ఏనుగుల ఐలయ్య, మాజీ ఎంపీటీసీ వజ్జ భద్రయ్య, పొడుగు సుగుణ, మండల యూత్ అధ్యక్షులు బాణోతు లక్ష్మణ్‌నాయక్, మండల ప్రచార కార్యదర్శి, యూత్ ఉపాధ్యక్షులు రేపాకుల వెంకన్న, మండల నాయకులు జర్పుల శ్రీను, రాయల్ రాజేష్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు ఇస్లావత్ వీరన్న, మాజీ సర్పంచ్‌లు ఇర్ప మమత, వంకుడోతు జగన్, తెల్లం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి సహకారం అందిస్తాం



● డీసీవో ఎన్.వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-తొర్రూర్‌రూరల్

పాడి పరిశ్రమ అభివృద్ధికి సహకారం అందిస్తామని జిల్లా సహకార అధికారి (డీసీవో) ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. తొర్రూర్ విజయ పాలశీతలీకరణ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వెలికట్ట శివారు ఆర్ డబ్ల్యూఎస్ భవనంలో అంతర్జాతీయ సహకార సంవత్సర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాడి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తొర్రూరు పాల కేంద్రం చైర్మన్ రాసాల సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విజయ డైరీ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కె.శావణ్ కుమార్ తో కలిసి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల ఆదాయం పెంచేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. పాడి పశువుల కొనుగోలు, బల్క్ మిల్క్ చిల్లింగ్ కేంద్రాలతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలు, డైరీ పార్లర్లు కల్పించేందుకు విజయ డైరీ చేయూత అందిస్తుందన్నారు.విజయ డైరీ డీడీ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో నూతన పాలశీతలీకరణ కేంద్రాల ఏర్పాటు, మౌళిక సదుపాయాల కల్పన, పాడి పశువులకు నాణ్యమైన దాణా ఉత్పత్తికి పటిష్టమైన కార్యచరణ చేపడుతున్నామన్నారు. విజయ డైరీ ఆధ్వర్యంలో మరిన్ని పార్లర్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. విజయ డైరీ పై ప్రజలకు నమ్మకం ఉందని, దాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో పాలకేంద్రం మేనేజర్ బారి వెంకటనారాయణ, ఆయా గ్రామాల సొసైటీల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, మధు, సుధాకర్ రెడ్డి, సుజాత, పాడి రైతులు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం..!









● వేలాది ఎకరాల్లో పంట నష్టం
● నేలమట్టమైన గుడిసెలు
● వరి మొక్కజొన్న పంటలు
● మామిడి రైతుకు తీరని వేదన
● కల్లాలలో తడిసిన మిర్చి
● విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-మహబూబాబాద్

గాలివాన బీభత్సానికి మానుకోట జిల్లా అతలాకుతలం అయింది. అకాల వర్షంతో అన్నదాతకు తీరనివేదన మిగిలింది. ఉరుములేని పిడుగులా వచ్చి పడిన వర్షానికి రైతాంగం తల్లడిల్లిపోయింది.పాడిపంటలు విలవిలలాడాయి.పేదల గుడిసెలు నేలమట్టమయ్యాయి. పచ్చని పంట చేలు నేలకొ రిగాయి. పక్వానికి వచ్చిన మామిడి, సపోటా, బొప్పాయి కాయలు నేలరాలాయి. అన్నదాతలు కన్నీటి పర్యంతమయ్యారు ప్రభుత్వ భూములలో వేసుకున్న గుడిసెలు ఎగిరిపోవడంతో రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. గుడిసెల్లో పేదలు రాత్రంతా సామాన్లతో వర్షంలో తడుస్తూ గడిపారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా కురిసిన గాలి వాన బీభత్సంతో అన్ని వర్గాల ప్రజలు తల్లడిల్లిపోయారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాలు, మండలంలో రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పచ్చని పంట పొలాల్లో అకాల వర్షం చిచ్చు పెట్టింది. నిండు వేసవిలో వచ్చిన చెడగొట్టు వానతో అన్నదాతలు అతలాకుతులమయ్యారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలు అన్నదాతకు, పేదలకు తీరనివేదన మిగిల్చాయి. జిల్లావ్యాప్తంగా మామిడి, బొప్పాయి, సపోటా, వరి, మొక్కజొన్న మిర్చి రైతులకు తీరని నష్టం వాటిల్లింది

● జిల్లాలో వర్షపాతం వివరాలిలా ఉన్నాయి..

మహబూబాబాద్ జిల్లాలో సోమవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 18 మండలాలు ఉండగా 9 మండలాల్లో వర్షపాతం నమోదైంది. 9 మండలాల్లో డిస్టిక్ యావరేజ్ వర్షపాతం 5.4ఎంఎం ఉండగా 86.8 ఎంఎం వర్షపాతం కురిసింది గంగారంలో 5.2ఎంఎం. కురవిలో 8.8 ఎంఎం, మహబూబాబాద్ లో 20.2ఎంఎం, కే సముద్రంలో 0.6 ఎంఎం, నెల్లికుదురులో 27.8ఎంఎం, చిన్నగూడూరు 1.0 ఎంఎం, మరిపెడలో 9.6ఎంఎం, తొర్రూర్ లో 6.4 ఎంఎం, పెద్ద వంగరలో 7.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా 27.8 ఎంఎం వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో వర్షం కురవలేదు

● మామిడి రైతుకు తీరని నష్టం

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మామిడి రైతుకు తీరని నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 15 వేల ఎకరాలలో మామిడి పంటలు విస్తరించాయి జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షానికి 10 మండలాల్లో 128 మంది రైతులకు చెందిన 438 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిలినట్లు వ్యవసాయ ఉద్యానవన అధికారి మరియన్న తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇద్దరు రైతులకు చెందిన ఐదు ఎకరాల్లో సపోటా పంట తోటలకు నష్టం వాటినట్లు అధికారులు తెలిపారు

● వరి పంటకు తీరని నష్టం

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షానికి 10 మండలాల్లో ఒక వెయ్యి 685 మంది రైతులకు చెందిన 2686 ఎకరాలలో వరి పంటకు తీరని నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల తెలిపారు. అలాగే 71 మంది రైతులకు చెందిన 130 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది . అలాగే 140 మంది రైతులకు చెందిన 473 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది అలాగే ఇద్దరు రైతులకు చెందిన ఐదు ఎకరాలలో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లింది.

● వందలాది గుడిసెలు నేలమట్టం

మహబూబాబాద్ పట్టణంలో కలెక్టరేట్ సమీపంలో ప్రభుత్వ భూములలో పేదలు వేసుకున్న గుడిసెలకు తీరని నష్టం వాటిల్లింది. పట్టణంలో సుమారు 2000 గుడిసెలు వేయగా గాలి వాన బీభత్సానికి 500 గుడిసెలు నేలమట్టమైనట్లు నట్టు సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్ తెలిపారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి
కూలిన గుడిసెలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



అకాల వర్షం మూలంగా పంట నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారం ఇవ్వాలని, కూలిన గుడిసెలకు ఇందిరమ్మ గృహాలు కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలో ప్రతి ఏటా వేసవి కాలంలో అకాల వర్షాలు వస్తున్నాయని ప్రభుత్వం, అధికారులు అంచనా వేస్తున్నారు తప్ప నష్టపరిహారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం, రాత్రిపూట అకాల వర్షం మూలంగా గుడిసెలు కూలిపోయి పేదలు పిల్లలతో వర్షంలో తడుస్తూ గడిపారని వారందరికీ ఇందిరమ్మ గృహాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అకాల వర్షం మూలంగా నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.25వేల నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు.

– సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్



'నవతెలంగాణ కథనం'పె స్పందించిన రెవెన్యూ అధికారులు

● ఇసుక డంపును సీజ్ చేసిన అధికారులు

నవతెలంగాణ-గార్ల:

అక్రమ ఇసుక నిల్వలను నియంత్రించేది ఎవరు? 'మూడు పువ్వులు- ఆరు కాయలుగా సాగుతున్న ఇసుక వ్యాపారాలు' అనే కథనంతో మంగళవారం నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ కృష్ణ వేణి ఆదేశాల మేరకు మంగళవారం ముల్కనూరు ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన 30 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపును ఆర్ఐ స్వప్న, గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తో కలిసి ఇసుకను సీజ్ చేశారు.

కూలిపోయిన ఇండ్లకు ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి: సీపీఐ(ఎం)

నవతెలంగాణ-మహబూబాబాద్



అకాల వర్షాలు, గాలి, దుమ్ము దూళీ తుఫాను మూలంగా కూలిన గృహాలకు తక్షణమే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, పంట నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి బానోతు తారాం నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబాబాద్‌లో సీపీఐ(ఎం) కాలనీలో కూలిన గుడిసెలను సందర్శించి మాట్లాడారు. అధికారులు చొరవ తీసుకొని కొనుగోలు కేంద్రాలు పెంచి రైతులకు పంటలు కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. . లేదంటే ఇండ్లు కూలిపోయిన బాధితులు, రైంతులతో ప్రజలను కూడగట్టి అధికారుల కార్యాలయలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రైతులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

దీప్తి జీవాంజీ నేటి యువతకు స్ఫూర్తి

● కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనసన్మానం..

నవతెలంగాణ-మహబూబాబాద్



దీప్తి జీవాంజి నేటి యువతకు స్ఫూర్తి అని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు మైస శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ పారా ఒలంపిక్స్ స్వర్ణ పతక విజేత, అర్జున అవార్డు గ్రహీత మన తెలంగాణ ముద్దుబిడ్డ దీప్తి జీవాంజిని ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. కాళోజీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నామిరెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఈసన్మాన కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు మైస శ్రీనివాస్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రకటించిన అర్జున అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకొని దేశంలో క్రీడా స్ఫూర్తికి వెన్నుదన్నుగా నిలిచారరన్నారు. అలాంటి మేలిమైనా క్రీడాకారిణిని సన్మానించుకోవడం అందులోనూ మన మహబూబాబాద్ లో మనం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకోవడం కాళోజీ వాకర్స్ అసోసియేషన్‌కు గర్వకారణమన్నారు. ఈకార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య కోశాధికారి సోమ విష్ణువర్ధన్, గౌరవ సలహాదారులు మైస నాగయ్య, ముఖ్య సలహాదారులు గూడూరు నాగేశ్వరరావు, దేవుడి మధుసూదన్ రెడ్డి, రాచకొండ ఉపేందర్, కుంజా రాంబాబు, మేడ వెంకటేశ్వర్లు, తోలెం వెంకటేశ్వర్లు, గోనే శ్యామ్ రావు, శ్యామల శ్రీనివాస్‌రెడ్డి, వాసం నాగేశ్వరరావు, వేముల రవీందర్, సంద వెంకన్న, తోడేటి వెంకన్న, బూర్ల ప్రభాకర్, దేవ్ సింగ్,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల బకాయిలను వెంటనే చెల్లించాలి

● గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ-మరిపెడ



గత ఆరు నెలల నుండి గ్రామపంచాయతీ ఉద్యోగులు అండ్ హెల్పర్లకు జీతాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, వాటిని వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మరిపెడ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కే. జానీమియా, అలువాల యాదగిరిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరిపెడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఎంఎవో సోమ్లా నాయక్‌కు బుధవారం సమ్మె నోటీసులు అందించారు. ఈకార్యక్రమంలో ఎల్లయ్య యాకుబ్, సీహెచ్.శ్రీనివాస్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె నోటిస్ అందజేత

నవతెలంగాణ-గార్ల:



గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హమీ లను వెంటనే అమలు చేయాలని ఈ నెల 19 నుండి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు తెలంగాణ గ్రామ పంచాయతీ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) మండల అధ్యక్షుడు పిడమర్తి దాస్ అన్నారు. గ్రామ పంచాయతీ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ముందస్తు సమ్మె నోటీస్‌ను మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మంగమ్మకు అందజేశారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి దస్తగిరి, నాయకులు సుధాకర్, సతీష్, నరేష్, ప్రేమ్ చంద్, అరవింద్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచిన బిజెపి ప్రభుత్వం

● సీపీఐ(ఎం) రాస్తారోకో

నవతెలంగాణ-గార్ల:



కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను మరో యాభై రూపాయలకు పెంచి పేదలు, సామాన్యుల నడ్డి విరుస్తున్నారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి.శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల.సత్యవతిలు ఆవేదన వెలిబుచ్చారు.కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను రూ.50లకు పెంచడాన్ని నిరసిస్తూ మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్ లో ఖాళీ సిలిండర్ లపై వంట పాత్రలు ఉంచి వినూత్న రీతిలో రాస్తారోకో నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు వీపీ వెంకటేశ్వర్లు, ఎ.వీరాస్వామి, టి.రమా, ఎస్.కె.మౌలానా, ఎ.రామకృష్ణ, కె.రామకృష్ణ, ఉమావతి, కె.సుజాత, పద్మ కోటయ్య, సాయి, వి.రణధీర్, వి.సాయి, మహిళలు, కార్యకర్తలు ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మహబూబాబాద్



మహబూబాబాద్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కమిటీ అధ్యక్షులు పి.రాఘవరెడ్డి పి.కృష్ణ మూర్తిగౌడ్ తెలిపారు. మంగళవారం మహబూబాబాద్‌లో నిర్వహించిన ఎన్నికలలో మహబూబాబాద్ జిల్లా నూతన అధ్యక్షులుగా కొప్పుల శంకర్, ప్రధాన కార్యదర్శిగా చెడుపల్లి ఐలయ్య, కోశాధికారిగా డి.సునీల్ ఎన్నికైనట్లు తెలిపారు. ఈనూతన కార్యవర్గం రెండు సంవత్సరాలు నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికైన నూతన కమిటీకి పలు ఉపాధ్యాయులు, పీఈటీలు అభినందనలు తెలిపారు. నూతన కమిటీని శాలువాలు పూలమాలతో సన్మానించారు.



నిలువ నీడ లేకుండా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

నవతెలంగాణ-బయ్యారం:

మండల పరిధిలోని నామాలపాడు గ్రామపంచాయతీకి చెందిన ఆదివాసి గూడెంలోని ప్రజలను ఇందిరమ్మ మంజూరు పత్రాల పేరుతో బురిడీ కొట్టించి దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు పట్ల ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ధ్వజమెత్తారు. మంగళవారం నామాలపాడు గ్రామపంచాయతీ నందు ఆదివాసి గూడెంలోని ప్రజలను ఆమె స్వయంగా కలిసి వారి సాధక బాధలను తెలుసుకున్నారు. పైలెట్ ప్రాజెక్టు పేరిట ఇందిరమ్మ ఇళ్ల పేరుతో 2025, జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున నామాలపాడులోని 115 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించి, అందించిన మూడు రోజుల తర్వాత సర్వే జరిపించి మరల ఇస్తామని మాయ మాటలు చెప్పి మంజూరు పత్రాలను వెనక్కి తీసుకొని కేవలం 15 మందికి మాత్రమే మంజూరు అయ్యాయని చెప్పి ఈ నెల 10న కేవలం ఇద్దరికీ మాత్రమే మంజూరయ్యాయి అంటూ శంకుస్థాపన చేస్తామంటూ హంగు ఆర్భాటాలు చేస్తున్న ప్రభుత్వ పనితీరు పట్ల అటు అర్హులైన లబ్ధిదారులను ఇటు ఒక గ్రామపంచాయతీ మొత్తం గ్రామస్థులను మోసగించారని ఇదెక్కడి వింత సంస్కృతి అని ప్రభుత్వాన్ని నిలదీశారు. గ్రామపంచాయతీని దత్తత తీసుకుంటానని చెప్పిన ఎమ్మెల్యే కోరం కనకయ్య పూర్తిగా ఆదివాసీలను మోసగించారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, మాజీ వైస్ ఎంపీపీ తాత గణేష్, సొసైటీ వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు బానోత్ మురళీకృష్ణ, ఆత్మకమిటి జిల్లా మెంబర్ ఏనుగుల ఐలయ్య, మాజీ ఎంపీటీసీ వజ్జ భద్రయ్య పొడుగు సుగుణ, మండల యూత్ అధ్యక్షులు బాణోతు లక్ష్మణ్ నాయక్, మండల ప్రచార కార్యదర్శి, యూత్ ఉపాధ్యక్షులు రేపాకుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గంగాభవాని జాతరను ఘనంగా నిర్వహించాలి

● తానంచర్ల గ్రామస్తుల నిర్ణయం

నవతెలంగాణ-మరిపెడ



ఈ నెల 20 , 21 , 22 తేదీలలో (ఆది , సోమ, మంగళవారాలు) తానంచర్ల గంగాభవాని జాతరను అంగరంగ వైభవంగా జరుగుతుందని భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మ వారి ఆశీర్వాదం పొందాలని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రామసహాయం సత్యనారాయణరెడ్డి , తేరా ప్రభాకర్‌రెడ్డి, ఆలయ పూజారి యసారపు లింగయ్యలు తెలిపారు. కీర్తి శేషులు, ఆలయ స్థలదాతలు ఐన రామసహాయం రంగారెడ్డి ఆలయాన్ని ఏంతో అభివృద్ధి చేసారని వారి కుటుంబ సభ్యులుగా దానిని కొనసాగిస్తూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని సత్యనారాయణరెడ్డి తెలిపారు మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, మాజి ఎంపీ కవితలు ఆలయ అభివృద్ధికి సహకారం అందించారన్నారు. అదేవిధంగా ప్రస్తుత ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్‌ల సహకారం తీసుకొని గ్రామా పెద్దల, అమ్మ వారి భక్తుల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. యాదవ సోదరులందరు ఉత్సహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో గ్రామపెద్దలు రామసహాయం ఆనందరెడ్డి, అజిత్ రెడ్డి, వాసంశెట్టి రమేష్, పాశం నరేష్‌రెడ్డి, దిగజార్ల ముకేశ్, వొడపల్లి రామన్న, శ్రావణరెడ్డి తేజావత్ సోమన్న, సీత వెంకన్న, సీత వీరబద్రం, సీత అంజీ, తేజావత్ రవి, గుండెపూడి భగవంతచారి, రాచకొండ రామన్న, పాశం వీరారెడ్డి, మేస్త్రి వెంకన్న, యసా రపు గణేష్, ఐలయ్య, వేల్పుల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

అకాల గాలి దుమారానికి మామిడి రైతులకు తీవ్ర నష్టం

● తీవ్రంగా నష్టపోయిన రైతులు

నవతెలంగాణ-బయ్యారం:



ఆకస్మాత్తుగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో చేతి కొచ్చే పంట నేలమట్టమై నట్టేట ముంచిందని మామిడి రైతులు వాపోతున్నారు. సోమవారం రాత్రి ఆకస్మికంగా వచ్చిన గాలి బీభత్సానికి మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల ఈదురు గాలులు పండ్ల తోటల పై తీవ్ర ప్రభావం చూపింది. మండలంలో సాగవుతున్న మామిడి తోటల పై, చివరి దశలో ఉన్న మొక్కజొన్న పంట పై ఈదురు గాలుల ప్రభావం పడింది. మండలంలో పలు ప్రాంతాల్లో గాలి దూమారానికి మామిడి కాయలు నేలరాలాయి. సాధారణంగా మే నెలలో మామిడి కాయలకు మంచి ధర వస్తుందన్న రైతులు ఈదురు గాలలు, గాలి దూమారానికి చేతికి వచ్చిన పంట నేలరాలి తీవ్రంగా నష్టపోయామని మామిడి రైతులు చెబుతున్నారు. వాటిని మార్కెట్‌లో విక్రయించినా ధరలు తక్కువగా వస్తాయని వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టిన పెట్టుబడి దక్కేలా లేదని కర్షకులు వాపోతున్నారు.

డివిజన్ ప్రాంతంలో భీకరమైన రాళ్లవాన..!

● రాలిన మామిడికాయలు.. నేలకొరిగిన వరి పంట

నవతెలంగాణ-తొర్రూర్





తొర్రూర్ డివిజన్‌లో అకాల వర్షం అన్నదాతను ఆగం చేసింది. గాలివాన వడగళ్లు రైతన్నను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతల ఆందోళన చెందుతున్నారు. మరో వారంరోజుల్లో వరికోత, రైతు చేతికి పంట అంతలోనే ఊహించని పరిణామంతో వరి రాలిపోయి నేలకొరిగింది. వరి, మామిడి పంటలు ఆకాల భారీ వడగాండ్ల వర్షానికి నేలమట్టమయ్యాయి. అధికారులు అంచనా వేస్తున్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలో ఈదురు గాలులకు ఫ్లెక్సీలు కూలిపోయాయి. ఇంకా అనేక గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు.

పత్తి విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

● వ్యవసాయాధికారి గుగులోతు స్వామి నాయక్

నవతెలంగాణ-పెద్దవంగర:



రైతులు పత్తి విత్తనాల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి గుగులోత్ స్వామి నాయక్ అన్నారు. మంగళవారం అవుతాపురం క్లస్టర్ పరిధిలోని ఉప్పరగూడెం గ్రామంలో రైతులకు పత్తి విత్తన సాగులో ముందస్తు సాగు ప్రణాళికలో భాగంగా చేపట్టవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కోనుగోలు చేయాలన్నారు. వరి పంట కోత సమయంలో రైతులు పాటించవలసిన జాగ్రత్తలను వివరించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు విశ్వశాంతి, రాజు, యశస్వినీ, రైతులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో.. ట్విన్నింగ్ ప్రోగ్రాం

నవతెలంగాణ-పర్వతగిరి



మండల కేంద్రంలోని స్థానిక మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ నందు మంగళవారం పర్వతగిరి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల యొక్క ట్విన్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా మోడల్ స్కూల్ లో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం కూడా ఘనంగా నిర్వహించారు. ట్విన్నింగ్ ప్రోగ్రాం వల్ల ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బలోపేత మవుతాయని దీనికి మన మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి కోరారు. ఈకార్యక్రమంలో పర్వతగిరి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

గాలి దుమారం అపార నష్టం

నవతెలంగాణ-గూడూరు



మండలంలోని సోమవారం రాత్రి కొన్ని గ్రామాలలో వచ్చిన అకాల గాలి దుమారంతో తీవ్ర నష్టం జరిగింది.. ఒక్కసారిగా గాలి రావడంతో చేతికొచ్చిన మొక్కజొన్న, వరి, ధాన్యం పూర్తిగా ఒరిగి రైతులకు దు:ఖాన్ని మిగిల్చాయి. మండలంలోని బొద్దుగొండ, కొల్లాపురం, ఎర్రగుంట తండ, కొంగర గిద్ద, మట్టెవాడ, అపరాజుపల్లి, గోవిందాపురం దుబ్బ గూడెం, నాయకపల్లి, తీగ లవేణి, గొల్లపల్లి గ్రామాల మీదుగా గాలి దుమారం రావడంతో పూర్తిస్థాయిలో చేతికొచ్చిన పంటలు, భారీ చెట్లు కూలి నేలమట్టమయ్యాయి, రోడ్లకు అడ్డంగా భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. వ్యవసాయ శాఖ సిబ్బంది పంటలను పరిశీలించి నష్టపోయిన రైతుల నివేదికలను ప్రభుత్వానికి అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వరంగల్



భవన నిర్మాణ కార్మిక సంక్షేమానికై పోరాటాలు

తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగాని ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-నర్సంపేట

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంపై నిరంత పోరాటాలు చేపట్టాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగాని ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో మేర భవన్ లో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం వరంగల్ జిల్లా 3వ మహాసభలు సమావేశం మేర భవన్‌లో ఎండీ.యాకూబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో అసంఘటిత కార్మిక రంగాల్లో పనిచేసేటువంటి కార్మికుల కోసం కార్మికుల చేత కార్మికుల కష్టంతో నిధులతో కార్మిక శాఖ నిర్వహిస్తున్నారన్నారు. కార్మికులే పెద్ద నిధి వారి కష్టం వారి శ్రమే ఆ శాఖలో వస్తున్న నిధులు కార్మికులు తమ శ్రమను రక్తంతో నడిపించి అంతస్తులకొద్ది అందమైన భవనాలు నిర్మిస్తూ, ఆ నిర్మాణాల ద్వారా వస్తున్నటువంటి 1 శాతం సెస్ ద్వారా జమవుతున్న వందల వేల కోట్ల రూపాయల నిధి కార్మికుల కుటుంబాలకు ఆసరాగా నిలబడాల్సిన కార్మిక శాఖ అధికారులు కార్మికుల సంక్షేమ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్నటువంటి కార్మికులను గుర్తించి వారికి కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులను జారీ చేయడంతో పాటు కార్మికులకు గుర్తింపు పాసు బుక్ లను కూడా మంజూరుకు ఈపాసు బుక్ ల ద్వారా నిజమైన కార్మికులు ప్రతిరోజు పని స్థలాల వద్ద మేస్త్రి లేదా యజమాని తో హాజరును నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 90 రోజులకు పైపడి కార్మికుడు పని దినాలకు హాజరైన కార్మికునికి మాత్రమే సంక్షేమ పథకాలు అమలు చేయవల్సి ఉందన్నారు. ఇటువంటి కార్మికులకు ఒక కార్మిక సంఘాల ధ్రువీకరణ తప్ప ఏ విధమైనటువంటి ప్రభుత్వ ధృవీకరణ ఉండదని, భవన నిర్మాణ రంగాలలో పనిచేసేటువంటి కూలీలు నూటికి 99 శాతం మంది నిరక్షరాస్యులై ఉండడం ద్వారా అధికారులు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనేక ఏళ్లుగా కార్మిక శాఖలో పనిచేసేటువంటి అధికారులు, ఉద్యోగులు, కొంతమంది వారి వారి సర్కిల్స్ పరిధిలో దళారులను నియమించుకొని అనర్హులైన వారిని కూడా అర్హులుగా చేస్తూ కార్మిక శాఖ గుర్తింపు కార్డులు (లేబర్ కార్డు)మంజూరు చేయడం వల్ల నిజమైన కార్మికులు నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.సమావేశం అనంతరం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోవర్ధన్ మియాపురం, అధ్యక్షునిగా ఎండీ.యాకూబ్ లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ మహాసభలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సమితి సభ్యులతో పాటు కార్మికులు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్విన్నింగ్ కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

ఎంఈవో జి.లింగారెడ్డి

నవతెలంగాణ-పర్వతగిరి



ట్విన్నింగ్ కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం చేయడానికి అవకాశం ఉంటుందని పర్వతగిరి మండల విద్యాశాఖాధికారి గాయపు లింగారెడ్డి అన్నారు. మండల లోని స్థానిక జడ్పీహెచ్ఎస్ పర్వతగిరి పాఠశాలలో కవల పాఠశాలలైన యూపీఎస్ బూరుగుమళ్ళ, యూపీఎస్ అన్నారం షరీఫ్, యూపీఎస్ దౌలత్ నగర్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మంగళవారం ట్విన్నింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతగిరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాక రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథి మండల విద్యాశాఖ అధికారి జి.లింగారెడ్డి పాల్గొని మాట్లాడారు. ట్వినింగ్ ప్రోగ్రాం వల్ల ప్రభుత్వ పాఠశాలను బలోపేతం అవుతాయని దీనికి మన మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు. అనంతరం కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు పాక రమేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేసి వచ్చే సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లను పెంచాలన్నారు. ఈకార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మడత శ్రీనివాస్, సోమేశ్వర్, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, అయా పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల పరిసరాలను మౌలిక వసతులను, బోధనా పద్ధతులను, పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం: సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్

నవతెలంగాణ-వరంగల్

ఆర్ఎస్ఎస్, బీజేపీ కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని మంగళ వారం అఖిలభారత నిరసన దినంగా పాటిం చాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జాతీయ కమిటీ పిలుపునిచ్చింది. ఈపిలుపులో భాగంగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏకశిల పార్క్ నుండి వరంగల్ కలెక్టరేట్ వరకు దేశంలో మోదీ మతోన్మాద చర్యలను నిరసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించి, వరంగల్ కలెక్టరేట్ ముందు ధర్నా చేసి డీఆర్వో ఎం.విజయ లక్ష్మి కి వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ వరంగల్ డివిజన్ కార్యదర్శి బొట్ల రాకేష్, జిల్లా నాయకులు మైదం పాణి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, టీయూసీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి అడ్డూరి రాజు, ఎఐయూకేఎస్ జిల్లా నాయకులు ధార లింగన్న, కత్తుల కొమరయ్య, సతీష్, అంకుష్, మాస్ లైన్ డివిజన్ నాయకులు బుచ్చన్న, జవహర్ లాల్, మల్లేష్, సింగన బోయిన కట్టయ్య, స్వరూప, సరోజన, సంతోష, ఇంద్ర, మరియా, కొడెం మమత, ధార రాధమ్మ, ఎర్రోళ్ల లక్ష్మమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరివాడు

సాంఘిక సంక్షేమ శాఖాధికారి నరసింహస్వామి

నవతెలంగాణ-మహబూబాబాద్



బాబాసాహెబ్ అంబేద్కర్ ఏ కొందరికో సంబంధించిన వ్యక్తి కాదని, ప్రపంచంలోని అందరికీ చెందిన వాడని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి నరసింహస్వామి అన్నారు. మంగళ వారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన విద్యార్థులకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ సహకారంతో జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీలకు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వార్థపరులు తమ సుఖం కోసమే జీవిస్తారని, సామాన్యులు తమ కుటుంబ సంక్షేమం కోసమే మనుగడ సాగిస్తారని, మహనీయులు మాత్రం సమాజ కళ్యాణం కోసం తమ జీవితాన్ని అర్పిస్తారన్నారు. అట్టి మాన నీయులైన మహనీయుల జీవిత చరిత్రలు సామాన్యులకు, ముఖ్యంగా యువతీయువకులకు మార్గదర్శ కాల న్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, భారత రా జ్యాంగ నిర్మాతగా, భారతరత్నగా ప్రపంచంలోనే మొదటి మేటి మేధావిగా బోధిసత్వనిగా, నవబుద్ధునిగా వెలుగొంది ఎందరికో ఆదర్శ ప్రాయుడయ్యాడన్నారు. ఈకార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, వ్యాసరచన పోటీల సమన్వయకర్త వెనగంటి శుభ, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజలతో పాటు జిల్లాలోని వివిధ మండలాల విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

పీజీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలి: డీఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-గార్ల:



జిల్లా కేంద్రంలో ఉన్న ఒకే ఒక్క పీజీ కళాశాలకు సొంత భవనం లేక రెగ్యులర్ స్టాఫ్ లేక ఎత్తివేసే కుట్ర జరుగుతుందని వెంటనే పీజీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు మాళోతు శాంతి కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం జి.సూర్యప్రకాశ్ అధ్యక్షతన జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో హాజరై మాట్లాడారు. గిరిజన జిల్లాలో ఉన్నత విద్యకు గిరిజన, దళిత విద్యార్థులను దూరం చేసేందుకు అధికారులు, ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నారని, విద్యార్థులకు సరైన భవనం,రెగ్యులర్ స్టాఫ్ లేక విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పీజీ కళాశాలకు 7 ఎకరాల భూమిని కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు కేటాయించారని, భవనాన్ని నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు కళాశాల నిర్మించకపోవడం విడ్డూరమన్నారు. అధికారులు స్పందించి కళాశాల నిర్మాణం చేపట్టి, స్టాఫ్‌ను రెగ్యులర్ చేయాలని, మండల కేంద్రం లో ఎస్ఎంహెచ్ వసతి గృహం ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం జూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయాలని, డోర్నకల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రతి మండలానికో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో రాష్ట్ర, మండల నాయకులు కె.సాయికుమార్, బి.శ్రీకాంత్, ఎన్. సాయి, డోర్నకల్ మండల నాయకులు నరేష్, వినయ్, రాజేష్, యుగేంధర్, తరుణ్, హరిచందర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవి జంపాల పిచ్చయ్య

నోపా లీగల్‌అడ్వయిజర్ విశ్వ

నవతెలంగాణ-బయ్యారం:



సమాజ సేవలో తరించిన కష్టజీవి జంపాల పిచ్చయ్య అని విశ్వ సమాజం వ్యవస్థాపకులు నోపా లీగల్ అడ్వయిజర్ జంపాల విశ్వ ఘనంగా కీర్తించారు. మంగళవారం జంపాల పిచ్చయ్య స్వగ్రామం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో జంపాల పిచ్చయ్య సంస్మరణ సభ నాయి బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ నోపా ఆధ్వర్యంలో నోపా ఉపాధ్యక్షులు ఉల్లెందుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత జంపాల పిచ్చయ్య చిత్రపటానికి రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.మంగ పతిరావు పూలమాల సమర్పించారు. ఈ సభలో పాల్గొన్న వక్తలు, ప్రముఖులు జంపాల పిచ్చయ్య కుమారులు కుమార్తెలు వారి కుటుంబ సభ్యులు జంపాల పిచ్చయ్యకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంపాల విశ్వ మాట్లాడుతూ జంపాల పిచ్చయ్య కులవృత్తి చేసుకుంటూనే తన ముగ్గురు కుమారులను ప్రయోజకులుగా తీర్చిదిద్దడమే కాకుండా, ఈ గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందటం అభినందనీయమని, ఇప్పటికీ వారిద్దరి కుమారులు వివిధ ప్రజా సంఘాలతో మమేకమై సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి శ్రీనివాస్ మాట్లాడుతూ జంపాల పిచ్చయ్య కుమారుడు, జంపాల యాకయ్య జన విజ్ఞాన వేదికలో పర్యావరణ విభాగంలో పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు తానంచర్ల మాజీ సర్పంచ్ కొండూరు వెంకన్న, కల్వల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పరిమి నవీన్, పీఏసీఎస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎల్ఐసీ నాయకులు మొద్దు వెంకన్న, నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఉల్లెందుల కనకయ్య, సత్యం, ఉపేందర్, సారంగం, మల్లయ్య, తోట. కృష్ణ, గడ్డల శ్రీనివాస్, శ్రీను, వెంకటాద్రి, ఎర్నాగి. రామ్మూర్తి, జన విజ్ఞాన వేదిక నాయకులు ఆర్‌వీ ప్రసాద్ రావు, బండి నరేందర్ రెడ్డి, ఐనాల నవీన్, జంపాల చక్రధర్, ఆవారి శ్రీనివాస్, అడ్వకేట్ జువ్వన్న మల్లేశం, జంపాల పిచ్చయ్య కుమారులు జంపాల యాకయ్య, జంపాల సోమయ్య, జంపాల జగన్, వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు గ్రామ పెద్దలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జంపాల పిచ్చయ్యను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.




మహనీయులకు నివాళులు

నవతెలంగాణ-మహబూబాబాద్

స్థానిక జడ్పీహెచ్ఎస్ శనిగపురం పాఠశాల యందు మహనీయుల మాసం ఏప్రిల్ నెలలో మహనీయుల జయంతోత్సవాన్ని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మహబూబాబాద్ మండలం శనిపురం గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాల లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశంలో బడుగు. బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులో నింపిన మహనీయులు మహాత్మ జ్యోతిబాపూలే జయంతి, ఏప్రిల్ 11, బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి, ఏప్రిల్ 14, డాక్టర్ జగ్జీవన్ రామ్ జయంతి, ఏప్రిల్ 5,మహనీయుల మాసం ఏప్రిల్ నెలగా పాటిస్తున్నామన్నారు. పేర్కొన్నారు. మహనీయులు వారి జీవితాలను త్యాగం చేసి బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం చక్కటి మార్గాలను ఏర్పాటు చేశారన్నారు. మహనీయుల ఆశయ సాధన కోసం బడుగు బలహీన వర్గాల ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాశరథి శ్రీధర్, ఉపాధ్యాయులు, చైతన్య మేడం, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్.డానియల్, టి.పర్వతాలు, జి.తబాలు, జి.వెంకట్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ సంఘం, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, చాత్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణరావుకు నేతల పరామర్శ.



నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని ఏనుగల్లు గ్రామంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ తక్కలపల్లి నారాయణరావు తల్లి సుభద్రా దేవి దిశదినకర్మ సందర్భంగా మంగళవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలు సుభద్ర దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు కర్నె రవీందర్, నాయకులు మంద శ్రీనివాస్, కందిమల్ల మహేష్, బోరియం నాగరాజ్, అర్జున్ గౌడ్, రంజిత్, తొర్రి లక్ష్మణ్‌యాదవ్, దేసు రాము, కర్నె వాసు, నాగరాజు, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌వో పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థుల విజయ దుందుభి

జీవంజి దీప్తి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం

నవతెలంగాణ-మహబూబాబాద్



ఐఎన్‌టీఎస్‌వో సెకండ్ లెవెల్ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థులు విజయ దుందుభి మోగించారని, 342 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వారికి అర్జున్ అవార్డు గ్రహీత జీవంజి దీప్తి చేతుల మీదుగా బహుమతులు వితరణ చేసినట్లు ప్రిన్సిపాల్ దాసరి మరియు తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు అర్జున అవార్డు గ్రహీత జీవంజి దీప్తి మాట్లాడారు. విద్యార్థి దశ నుండే ఒక లక్ష్యం పెట్టుకొని ప్రయత్నం చేస్తే ప్రతి ఒక్కరూ విజయం సాధించవచ్చని, స్ఫూర్తి ప్రధాతలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి మధు, పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, కో-ఆర్డినేటర్ కృష్ణారావు, పార్వతీ, కృష్ణ గౌతమి, డీన్ నరేష్ , సీబ్యాచ్ ఇన్‌ఛార్జ్ లక్ష్మీనారాయణ, ప్రైమరీ ఇన్‌ఛార్జ సుస్మితలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-తొర్రూర్(దంతాలపల్లి)

దంతాలపల్లి మండలంలోని పెద్ద ముప్పారం గ్రామం జన వికాస ఆధ్వర్యంలో ఉడుగుల ఐలయ్య చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈప్రారంభోత్సవానికి ఏకశిలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాటిరాములు హాజరై మాట్లాడుతూ ఎండాకాలంలో బాటసారుల కోసం జన వికాస ఆధ్వర్యంలో ఉడుగుల ఐలయ్య పెద్ద మనసుతో ఆలోచించి వారి అబ్బాయి ఉడుగుల సంతోష్ జ్ఞాపకార్థంగా జల దానం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అన్నారు. ఈకార్యక్రమంలో కో-ఆర్డినేటర్‌లు మార్గం శోభారాణి, చిలకమర్రి యాకలక్ష్మీ, ఉడుగుల గంగమ్మ తుమ్మ నాగలక్ష్మి, బండి సునీత, సెగ్గం భిక్షమమ్మ, సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గలో మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-కాశిబుగ్గ

లక్ష్మీ గణపతి పరపతి సంఘం ఆధ్వర్యంలో కాశిబుగ్గలో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో గత 11సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా మజ్జిగ దాతలు దాసి శివకృష్ణ, దీప్తి, దాసి సుహాస్ కృష్ణ లను అభినందించారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్, కోశాధికారి దుస్స కృష్ణ ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, వంగరి రవి, గాదే జగన్, క్యాతం శ్రీనివాస్, కానుగంటి పవన్, గాజుల రాజేష్, బండారి లక్ష్మణ్, క్యాతం రవీందర్, ములుక సురేష్, ప్రకాష్, ఐలయ్య, సతీష్, నగేష్, రామచంద్రం, వీరస్వామి, పాపయ్య, లక్ష్మీనారాయణ, కమలాకర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంట దగ్ధం

నవతెలంగాణ-కొత్తగూడ



మండలంలోని పెగడపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు పంట చేను దగ్ధమైంది. గ్రామానికి చెందిన బొల్లు రవి రైతు ఆరుగాలం కష్టపడి వ్యయప్రయాసాల కోర్చి కాపాడుకున్న పంట కాలి బూడిద అవడంతో జరిగిన నష్టాన్ని గుర్తించి ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నారు.

పంటల పరిశీలన

నవతెలంగాణ-నెల్లికుదురు

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతుల పంటలు దెబ్బతిన్న వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్‌కే.యాస్మిన్ తెలిపారు. మంగళవారం ఎఈవో రైతులతో కలిసి నెల్లికుదురు, రాజుల కొత్తపల్లి, వావిలాల, శ్రీరామగిరి, కాచికల్, ఆలేరు, రెవెన్యూ గ్రామాలలో నష్టపోయిన పంటలను పరిశీలించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడగండ్ల వర్షానికి మండలంలోని వివిధ గ్రామాలలో పంటలు దెబ్బతిన్నాయని తెలిసిన వెంటనే ఆయా గ్రామాలకు ఏఈఓ లను పంపించి రైతుల పరిస్థితి అడిగి తెలుసుకుని క్షేత్రస్థాయిలో పంపించామన్నారు. మండలంలోని వరి పంట 284 ఎకరాలు, మొక్కజొన్న సుమారు 20 ఎకరాలు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు రవి ప్రవీణ్ ప్రతిభ చందన మణికంఠ రైతులు ఉన్నారు.

రాళ్ల వర్షంతో రాలిన వడ్ల పంట

ప్రభుత్వమే ఆదుకోవాలి

నవతెలంగాణ-నెల్లికుదురు



ఆకాల వర్షంతో అన్నదాత ఆగమైందని ఇటీవల కురిసిన వర్షంతో నా వరి పంట మొత్తం రాలి నేల పాలైందని తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు రైతు చినురి మధుకర్ సంబంధిత అధికారులను, ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. మంగళవారం మండలంలోని రాజుల కొత్తపల్లి గ్రామానికి చెందిన బాధిత రైతు చీనూరి మధుకర్ మాట్లాడుతూ నేను ప్రతి సంవత్సరం మాదిరిగానే వరి పంట మూడు ఎకరాలను సాగు చేసుకుని నా కుటుంబాన్ని పోషించుకుంటున్నాన, అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి నాట్లు వేసి కలుపు తీసి మందులు వేసి పిచికారి చేసి తీరా వరి పంట చేతికి అందే సమయానికి అకాల వర్షంతో వడగండ్ల రాళ్లు పడడంతో వరి పంట పై రాళ్ల వర్షం పడడంతో వడ్లన్ని నేలపాలయ్యాయన్నారు. దీంతో పెద్ద మొత్తంలో నష్టపోయానని, తనను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

సీజ్ చేసిన ఇసుక రూ.లక్ష మూడు వేలకు వేలం పాట

నవతెలంగాణ-గార్ల:

మండలంలోని ముల్కనూరు పంచాయితీలోని దుబ్బగూడెం గ్రామంలో గత వారం రోజుల క్రితం రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన 30 ట్రాక్టరు ట్రిప్పుల ఇసుకను స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ కృష్ణ వేణి సమక్షంలో మంగళవారం వేలం పాట నిర్వహించగా మండలానికి చెందిన గుగులోతు చాంద్‌మాల్ రూ.1,03,100లకు వేలం పాటలో దక్కించుకున్నారు. దుబ్బగూడెంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. వేలం పాట ద్వారా ఇసుక డంపును దక్కించుకున్న వ్యక్తి రెండు రోజులలో డీడీ కట్టాలని, 30 ట్రిపుల కంటే అదనంగా ఉంటే ట్రాక్టర్‌కు రూ.1800 చొప్పున చెల్లించాలని తహసీల్దార్ ఆదేశించారు.

పిచ్చయ్య కుటుంబానికి సొసైటీ చైర్మన్ పరామర్శ

నవతెలంగాణ-బయ్యారం:

మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంపాల పిచ్చయ్య అనారోగ్యంతో మరణించారు. మంగళవారం వారి కుటుంబాన్ని సింగిల్ విండో చైర్మన్ మూల మధుకర్ రెడ్డి పరామర్శించి, చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నవరంగరలో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-పెద్దవంగర:

మండలంలోని చిన్నవంగర గ్రామంలో మంగళవారం బాలవికాస సేవా సంస్థకు అనుబంధ సంస్థ అయినా జన వికాస ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ సర్పంచ్ పాకనాటి రామకృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం సంస్థ మెయిన్ కో-ఆర్డినేటర్ ఎం.రమతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రజల దాహార్తిని తీర్చేందుకు బాలవికాస సంస్థ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనాథ్ రెడ్డి, బాలవికాస కో-ఆర్డినేటర్ సరిత, విజయ, నాగమ్మ, నీలవేణి, బాలవికాస మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: ఎంసీపీఐయూ

నవతెలంగాణ-కేసముద్రంరూరల్:



కేసముద్రం మండలం ఎంసీపీ ఐయూ పార్టీ మహబూ బాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహ సిల్దార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐయూ పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ ఈనె 7 న సాయంత్రం ఈదురు గాలులు, అకాల వర్షంతో వడగళ్ల వాన మూలంగా మామిడికాయలు రాలిపోయాయని, రైతుల వరి పంటలు, మొక్కజొన్న పంటలు నేలకొరిగి దెబ్బతిన్నాయని అదేవిధంగా ఇండ్లకు రేకులు వేసుకొని ఇల్లు కట్టుకున్న వాళ్ల రేకులు ఎగిరిపోయాయని అట్టివారు ఆర్థికంగా నష్టపోయారని, రైతులను వీరితోపాటు ఇంటి రేకులు గాలి దుమారంలో నష్టపోయిన బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంసీపీఐయూ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లోజు రామ్ మోహనచారి, ధారావత్ రమేష్, ఏఐసీటీయూ నాయకులు వెన్ను శ్రీరాములు, ముదిగిరి కుమార్ తదితరులు పాల్గొన్నారు,

నేలమట్టమైన వడ్లు

నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-కేసముద్రంరూరల్:



కేసముద్రం మండలంలో నారాయణపురం గ్రామంలో ఈదురు గాలులకు తులసీతండాలో ధరావత్ భజ్జ ఇంటి పైకప్పు గాలికి చెట్లపైకి వెళ్ళింది, పెద్ద మోరి తండాకు చెందిన భద్రి వడగల్లు వానకు వడ్లు మొత్తం నేలరాలాయి. అదే తండాకు చెందిన జాటోతు వెంకన్న ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు కూలింది. ఎస్సీ కాలనీకి చెందిన ఇండ్లపై కప్పులు గాలి దుమారానికి లేచిపోయాయి. కొత్తూరులో 8 మంది రైతుల పొలాలు నేలమట్టమై వడ్లు మొత్తం కింద రాలిపోయాయి. కొత్తూరు గ్రామంలో రైతుల పొలాలలో వడ్లు మొత్తం రాలిపోయాయి. చేతికందే సమయంలోనే పంట పొలాలన్ని దెబ్బతిన్నాయి. రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.